RNI NO :Title-Code :-TELTEL02102

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దినపత్రిక

అనుక్షణం ప్రజలపక్షం...




అయోధ్యలో ప్రముఖుల సందడి

WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా, మండల, కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను.

KKR NEWS

ఎడిటర్ : బిర్రు కరుణాకర్

Cell: 9701249103

ప్రచురణ : హైదరాబాద్, శనివారం 27-1 -2024 | సంపుటి :01 | ఎడిటర్ : బిర్రు కరుణాకర్ | సంచిక : 127 | పేజీలు : 4 | వెల : 5-00

## రాజ్‌భవన్‌లో ఎట్‌హోమ్



- సిఎం రేవంత్ తదితరుల హాజరు

- ఎప్పటిలాగే బిఆర్ఎస్ నేతల గైర్హాజరు

వివరాలు 2లో

## ఫ్రాన్స్‌లో భారతీయ విద్యార్థులకు పెద్దపీట

- ఎక్కువ మంది చదువుకునేలా అవకాశాలు

-ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మెక్రాన్ వెల్లడి



మిగతా 2లో

## రాజోలు, రాజానగరంలో జనసేన పోటీ

- పొత్తు ధర్మం - విస్మరించడం సరికాదు ఎన్నో ఒత్తిళ్లు ఉన్నా - సంయమనంతో సాగాలి

-టిడిపికి దీటుగా రెండు సీట్లపై పవన్ ప్రకటన

వివరాలు 2లో



### లోక్‌సభ ఎన్నికల తరవాత

# బిఆర్ఎస్ ఔట్

## ఆ పార్టీ కనుమరుగు కావడం ఖాయం

## అధికారంలో ఉండగా అడ్డగోలు దుర్వినియోగం

## మంత్రి ఉత్తమ్ సంచలన వ్యాఖ్యలు



సూర్యాపేట,జనవరి26
జర్నలిస్ట్ వార్త,

లోక్‌సభ ఎన్నికల తర్వాత తెలంగాణలో బీఆర్ఎస్ మరింత బలహీన పడుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జోస్యం చెప్పారు. పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర రాజకీయాలలో బీఆర్ఎస్ మరుగున పడుతుందని ఉత్తమ్ అన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి 14 సీట్లు రావడం ఖాయమని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి రెండు, మూడు సీట్లే వస్తాయని అన్నారు.

తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయిందన్నారు. తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్యే పోటీ ఉంటుందన్నారు. రైతులకు ఉచిత విద్యుత్, రైతు బంధు నిధుల విడుదలపై బీఆర్ఎస్ నేతలు అబద్దాలు ఆడుతున్నారని ఉత్తమ్ ÷ర్ అయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన బీఆర్ఎస్ పార్టీ, పార్లమెంట్ తర్వాత భూస్థాపితం అవుతోందని అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా పల్కవీడు మండలం జాన్‌పహాడ్ సైదులు దర్గా వార్షిక ఉత్సవాల్లో పాల్గొన్న అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ 13-14 లోక్‌సభ స్థానాలలో విజయం సాధిస్తుందని, ఒకటి, రెండు స్థానాలకు బీఆర్ఎస్ పరిమితమవుతుందని చెప్పారు. తెలంగాణలో లోకసభకు ప్రధాన పోటీ కాంగ్రెస్,

- మిగతా 2లో పేజీలో

# నిరంకుశ ప్రభుత్వాలకు తావులేదు

*గణతంత్ర దినోత్సవం సందర్భంగా తెలంగాణ గవర్నర్ తమిళి సై సౌందర రాజన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలను ఎత్తి చూపారు. 'పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో రాజ్యాంగ విలువలు విధ్వంసానికి గురయ్యాయన్నారు. ప్రజా ప్రభుత్వంలో వాటిని నిర్మించుకుంటున్నాం. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా పాలన సాగించినప్పుడే ప్రజాస్వామ్యం ఫరిడవిల్లుతుందన్నారు. సంక్షేమ, అభివృద్ధి ఫలాలు ప్రతి పేదవాడికి అందుతాయి. ఏకపక్ష నిర్ణయాలు, నియంత పోకడలు ప్రజాస్వామ్యానికి మంచిది కాదని వ్యాఖ్యానించారు. కొత్తగా ఏర్పడిన ప్రజా ప్రభుత్వం సమాజంలోని అన్ని వర్గాలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు లభించాలనే లక్ష్యంతో పని చేస్తోందని' తమిళి సై సౌందర రాజన్ సందేశం ఇచ్చారు.*

- రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా పాలన
- గత పదేళ్లలో రాజ్యాంగ విలువలకు తిలోదకాలు
- ప్రస్తత ప్రజాపాలనలో ప్రజలకు చేరువగా ప్రభుత్వం
- పథకాల అమలు..హామీలు నెరవేర్చే క్రమంలో నిర్ణయాలు
- టిపిపిఎస్సీ ప్రక్షాళనతో నిరుద్యోగులకు మంచి రోజులు
- గణతంత్ర వేడుకల్లో గవర్నర్ కీలక వ్యాఖ్యలు




హైదరాబాద్,జనవరి26
జర్నలిస్ట్ వార్త,

గత పదేళ్లలో తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉంది. గవర్నర్ తమిళి సై సౌందర రాజన్, అప్పటి సీఎం కేసీఆర్ మధ్య పడలేదు. ఈ విషయాన్ని తన ప్రసంగంలో ప్రధానంగా ప్రస్తావించారు. పబ్లిక్ గార్డెన్‌లో జరిగిన వేడుకల్లో ఆమె జెండా ఆవిష్కరించి గౌరవవందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా పాలకులు వ్యవహరించిన సమయంలో ప్రజల తీర్పుల ద్వారా అధికారాన్ని నియంత్రించే శక్తి రాజ్యాంగం ఇచ్చింది. రాజ్యాంగ స్ఫూర్తితో, రాజ్యాంగం కల్పించిన హక్కుల ద్వారా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం. తెలంగాణ రాష్ట్రంలో పాలన రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా జరినప్పుడు, ఆ పాలనకు చరమగీతం పాడే అవకాశం ప్రజలకు రాజ్యాంగం ఇచ్చిన హక్కు. గత 10 ఏళ్లలో పాలకులు రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా, నియంతృత్వ ధోరణితో వ్యవహరించారు. అది సహించని తెలంగాణ సమాజం ఇటీవల జరిగిన ఎన్నికల్లో తమ తీర్పు ద్వారా బుద్ధి చెప్పింది. ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుంది. అహంకారం, నియంతృత్వం చెల్లదని ఈ తీర్పుతో స్పష్టమైంది.

- మిగతా 2లో పేజీలో

# బిఆర్ఎస్ అక్రమాలపై విచారణ

## 14 లోక్‌సభ స్థానాలు గెలుస్తాం: మంత్రి ఉత్తమ్

సూర్యాపేట,జనవరి26
జర్నలిస్ట్ వార్త,

గత ప్రభుత్వ అక్రమాలపై విచారణ ప్రారంభించామని, అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. జాన్‌పహాడ్ దర్గా ఉర్సులో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పాల్గొని.. దర్గా అభివృద్ధికి రూ.కోటి ప్రకటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల తర్వాత భారాస మరింత బలహీనమవుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 14 లోక్‌సభ స్థానాలు



గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. భారాస ఒకట్రెండు స్థానాలకే పరిమితమవుతుందని వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో కాంగ్రెస్, భాజపా మధ్యే ప్రధాన పోటీ ఉంటుందన్నారు.

# నాలో ఉన్నదీ వైఎస్ రక్తమే

- ఏదో ఆశించి నేను
- పాదయాత్ర చేశానా
- ఏమి ఆశించామో మా
- అమ్మను అడిగితే చెబుతుంది
- నిరుద్యోగులు రోడ్డు పడ్డా పట్టింపు లేదు
- పోలవరం నేటికీ పూర్తి
- చేయకపోవడం దారుణం






## ఘనంగా గణతంత్ర వేడుకలు

- కర్తవ్యపథ్‌లో జెండా ఆవిష్కరించిన రాష్ట్రపతి ముర్ము
- ఆకట్టుకున్న శకటాలు..సైనిక విన్యాసాలు
- సత్తా చాటిన యుద్ద ట్యాంకులు..ఆయుధ సంపత్తి
- ముఖ్య అతిథిగా హాజరైన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్
- అమర జవాన్లకు నివాళి అర్పించిన ప్రధాని మోడీ

# నాలో ఉన్నదీ వైఎస్ రక్తమే

విజయవాడ,జనవరి26 ఏదో ఆశించి తాను పాదయాత్ర చేయలేదని.. ఏదో ఆశించి ఎప్పుడూ తన అన్న జగన్ వద్దకు తాను వెళ్లలేదని ఏపీసీసీ చీఫ్ షర్మిల అన్నారు. విజయవాడలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో ఆమె పాల్గొని.. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వైసీపీ నేతలు తనపై చేస్తున్న విమర్శలపై కౌంటర్ ఇచ్చారు. ఎవరో తనకు కితాబు ఇస్తే తన విలువ ఎక్కువ కాదని.. కితాబు ఇవ్వకపోయినా తన విలువ తక్కువ కాదని అన్నారు. 'నేను వైఎస్సార్ రక్తం. రాజశేఖర్ రెడ్డి వైఎస్ రాజశేఖర్ రెడ్డి అయినప్పుడు ఆయన బిడ్డ వైఎస్ షర్మిల కాకుండా ఎలా పోతుంది.?. నా కుమారుడికి వైఎస్ రాజారెడ్డి అని పేరు పెట్టుకున్నా. నాకు చాలా దగ్గర మనిషి కొండా రాఘవరెడ్డి కూడా నేను అడిగి పాదయాత్ర చేశానని మాట్లాడారు. భారతమ్మ చేయాలనుకున్న పాదయాత్ర నేను చేశానట. స్వార్థం కోసమే పాదయాత్ర చేశానని అంటున్నారు. మీ ఆరోపణలు నిజం కాదని నేను ప్రమాణం చేయగలను. మీరు చేయగలరా.?. మేము అక్రమ సంపాదనకు స్కెచ్ వేశామని అంటున్నారు. నా భర్త అనిల్ ఒక్కరోజు కూడా జగన్ ను కలవలేదు. అధికారంలోకి వచ్చాక నేను మా అమ్మ విజయమ్మతో ఒక్కసారి మాత్రమే జగన్ వద్దకు వెళ్లాను. ఇవాళ్టి వరకూ ఏదీ ఆశించి నేను జగన్




వద్దకు వెళ్లలేదు. అందుకు మా అమ్మే సాక్ష్యం. దమ్ముంటే విజయమ్మను అడగండి. వైఎస్సార్ ఆశయ సాధన కోసమే నేను కాంగ్రెస్ పార్టీలో చేరానని షర్మిల వ్యాఖ్యానించారు. అన్ని వర్గాల వారి కోసం అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారని.. ఆయన భారీ విగ్రహాలు పెడితే పేదల ఆకలి తీరదని షర్మిల అన్నారు. రాష్ట్రంలో దళితులపై దాడులు వంద శాతం పెరిగాయని మండిపడ్డారు. అంబేడ్కర్ గురించి గొప్పలు చెప్పడం కాదని.. ఆయన ఆశయాలను అమలు చేయాలని హితవు పలికారు. 'కొందరు నియంతల్లా మారి రాజ్యాంగాన్ని కాలరాస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ నిధులను దారి మళ్లించి సొంత అవసరాలకు వాడుకున్నారు. దళితులపై కపట ప్రేమ చూపే వారికి తగిన బుద్ధి చెప్పాలి. ప్రాంతీయ పార్టీల బడుగు, బలహీన వర్గాలను సమానంగా చూడడం లేదు. 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వని పార్టీలకు మద్దతు తెలపబోమని ప్రజలు ప్రమాణం చేయాలి.' అని పిలుపునిచ్చారు. అనంతరం, కృష్ణా జిల్లా కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలతో షర్మిల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నేతలు గిడుగు రుద్రరాజు, ఆళ్ల రామకృష్ణా రెడ్డి, కొప్పుల రాజు, పల్లంరాజు ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా షర్మిల కీలక వ్యాఖ్యలు చేశారు. 'నేను వైఎస్ రక్తం. పులి కడుపున పులే పుడుతుంది. వైఎస్సార్ పాలనకు జగనన్న గారి పాలనకు చాలా వ్యత్యాసం ఉంది. వైఎస్ హయాంలో పోలవరం పనులు 32 శాతం పూర్తి చేశారు. రూ.5 వేల కోట్లు ఖర్చు చేశారు. ఆయన మరణం తర్వాత ప్రాజెక్ట్ పక్కన పడింది. చంద్రబాబు వచ్చినా, జగనన్న గారు వచ్చినా ప్రాజెక్టు ముందుకు కదలలేదు. వైఎస్సార్ 17 శాతం నిధులు కేటాయిస్తే.. జగనన్న కేవలం 2.5 శాతం నిధులు ఖర్చు చేశారు. ఏపీలో 19 లక్షల మంది నిరుద్యోగులు ఉద్యోగాలు లేక రోడ్లపై తిరుగుతున్నారు. బీజేపీతో దోస్తీ కోసం చంద్రబాబు, జగన్ ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టారు. 25 మంది ఎంపీలను ఇస్తే ఒక్క రోజు కూడా హోదాపై మాట్లాడలేదు. పోలవరం లేదు, రాజధాని లేదు, ప్రత్యేక హోదా లేదు.. ఉన్నవన్నీ అప్పులే. ఒక్క సీటు లేని బీజేపీ రాష్టాన్ని శాసిస్తోంది. అభివృద్ధి కావాలంటే రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలి. హస్తం పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్దాం.' అని షర్మిల నేతలకు పిలుపునిచ్చారు.

## రాజ్‌భవన్‌లో ఎట్‌హోమ్

హైదరాబాద్,జనవరి26: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటిసారి రాజ్‌భవన్‌లో ఎట్ హోం కార్యక్రమం జరిగింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ తమిళిసై ఆతిథ్యం ఇవ్వగా.. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఏటా స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం రోజున రాష్ట్రంలోని ప్రముఖులను గవర్నర్ రాజ్‌భవన్‌కు ఆహ్వానించి తేనీటి విందు ఇవ్వడం ఆనవాయితీగా వస్తోందన్న విషయం తెలిసిందే. అయితే ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గానీ.. ఆ పార్టీ తరపున ముఖ్య నేతలెవ్వరూ హాజరుకాలేదు. అధికారంలో ఉన్నప్పుడు కూడా కెసిఆర్ హాజరు కాలేదు. బిఆర్ఎస్ ఎమ్మెల్సీలు బండ ప్రకాష్, గోరటి వెంకన్నలు మాత్రమే కార్యక్రమానికి హాజరయ్యారు. అధికారంలో ఉన్నా.. లేకున్నా గైర్హాజరు మాత్రం పరిపాటిగా వస్తోందనే విమర్శలు బీఆర్ఎస్‌పై గట్టిగానే వస్తున్నాయి. బీజేపీ నుంచి మాత్రం కొందరు కీలక నేతలు హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా గణతంత్ర దినోత్సవ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. నాంపల్లి పబ్లిక్ గా÷-డ్గ÷న్స్‌లో తమిళిసై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కుల ద్వారానే తెలంగాణ సాధించుకున్నామని గవర్నర్ గుర్తుచేశారు. ఇటు ఎట్ హోం కార్యక్రమం జరుగుతుండగానే బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'గవర్నర్ వ్యవస్థ రద్దు చేయాలి. గవర్నర్ బీజేపీ ప్రతినిధిలాగా మాట్లాడుతున్నారు.

## రాజోలు, రాజానగరంలో జనసేన పోటీ



అమరావతి,జనవరి26 వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన పోటీ చేసే 2 స్థానాలను ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ప్రకటించారు. తెదేపా 2 సీట్లు ప్రకటించినందున తానూ 2 స్థానాలను ప్రకటిస్తున్నట్లు చెప్పారు. రాజోలు, రాజానగరంలో జనసేన పోటీ చేస్తుందన్నారు. మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన రిపబ్లిక్ డే వేడుకల్లో జాతీయ పతాకాన్ని పవన్ ఆవిష్కరించారు. అనంతరం కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ..తెదేపాతో కలిసే ఎన్నికలకు వెళు తున్నాం. ఆ పార్టీతో కలిస్తే బలవంతులమవుతాం. ఉమ్మడి మేనిఫెస్టో ఉంటుంది. పొత్తుల్లో ఒక మాట అటూ ఇటూ ఉంటుంది. ఎన్ని స్థానాలు తీసుకోవాలో నాకు తెలుసు. సీఎం జగన్‌కు ఊరంతా శత్రువులే. ఆయనపై వ్యక్తిగత కక్ష లేదు. వైకాపా నేతలకు కష్టమొస్తే నా వద్దకు రండి. పొత్తు దెబ్బతినేలా కొందరు మాట్లాడుతున్నారు. 2024లో జగన్ ప్రభుత్వం అధికారంలోకి రాకూడదని అన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఈ మధ్య మండపేట, అరకు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించడం ఇప్పుడు వివాదం అవుతోంది. దీన్ని పవన్ కల్యాణ్ తప్పుపడుతున్నారు. మండపేట నుంచి చాలా మంది నాయకులు వచ్చారు. చాలా బాధపడిపోతున్నారు. మండపేటలో టీడీపీ అభ్యర్థిని ప్రకటించడం బాగా లేదన్నారు. నిజంగానే అది చెప్పాల్సింది పార్టీ నేతల అభిప్రాయాలతో ఏకీభవిస్తాను. చాలా ఇబ్బంది పడ్డాం. గత ఎన్నికల్లో 18 శాతం ఓటింగ్ ఉంది. అది ఇవాళ చాలా బలమైనదిగా ఉంది. ఇప్పుడు అది పదిశాతం పెరిగింది. అయితే నేను ఒక నియోజకవర్గం గురించి మాట్లాడితే ఆ ప్రాంత లీడర్నే అవుతాను. నేను రాష్టాన్ని యూనిట్‌గా చూస్తాను . దీని వల్ల కొన్నిసార్లు ఇబ్బంది కలగవచ్చు. పొత్తు ధర్మం ప్రకారం ప్రకటించకుండా ఉండాల్సింది. నేను పార్టీ లీడర్లకు క్షమాపణ చెబుతున్నాను. వచ్చే సమావేశాల్లో మాట్లాడి దాన్ని ఎలా సరిదిద్దాలో సరిదిద్దుతాం. రాజోలు, రాజానగరంలో జనసేన పోటీ చేస్తుందని ప్రకటించారు.

జనసేన ఆఫీస్‌లో జెండా ఆవిష్కరించిన తర్వాత పార్టీ లీడర్లతో మాట్లాడిన పవన్ కల్యాణ్ టీడీపీ ఏకపక్షంగా అభ్యర్థులను ప్రకటించడంపై చాలా ఘాటుగానే స్పందించారు. పొత్తు ధర్మం ప్రకారం టీడీపీ సీట్లు అనౌన్స్ చేయకూడదు అన్నారు. లోకేష్ సీఎం పదవి గురించి మాట్లాడిన తాను పట్టించుకోలేదన్నారు. చంద్రబాబు నన్ను అడగకుండా రెండు సీట్లు ప్రకటించారు కాబట్టి నేను రెండు సీట్లు ప్రకటిస్తా అన్నారు పవన్.

రాజోలు, రాజనగరంలో జనసేన పోటీ ఉంటుంది తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబుకు ఉన్నట్టే తనకూ పార్టీ లీడర్ల నుంచి ఒత్తిడి ఉందని... అందుకే ప్రత్యేక పరిస్థితుల్లో ఈ రెండు సీట్లలో పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్టు అభ్యర్థులను ప్రకటించినట్టు పవన్ చెప్పుకొచ్చారు. కలిసి ముందుకు వెళ్తేనే బలమైన నిర్మాణం చేసుకోవచ్చని అన్నారు. ఎప్పుడు జనసేన బలం ఇచ్చేవాళ్లం అవుతున్నాంగానీ తీసుకునే పరిస్థితులో లేకుండా పోతున్నామన్నారు. పోటీ కోసం 50-70 స్థానాలు తీసుకోవాలని తనకు తెలియనిది కాదని... కానీ ఒంటరిగాపోటీ చేస్తే కొన్ని సీట్లు వస్తాయో లేదో తెలియదు అన్నారు. వాస్తవాలు తెలియవని చాలా మంది విమర్శిస్తుంటారని అవి తెలియకుండా రాజకీయాల్లోకి ఎలా వచ్చానని ప్రశ్నించారు. ఇద్దరు వ్యక్తులను కలపడం కష్టమని.. విడదీయం చాలా తేలికన్నారు. అందుకే తనకు ఎప్పుడూ కలపడమే ఇష్టమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనలు దృష్టికి పెట్టుకొని నేను మౌనంగా ఉంటున్నాని తెలిపారు. సీనియర్ నేతగా ముఖ్యమంత్రిగా పని చేశారు కాబట్టి అలా జరుగుతూ ఉంటాయనుకున్నట్టు వివరించారు.

# నిరంకుశ ప్రభుత్వాలకు తావులేదు

(మొదటి పేజి (తరువాయి)

ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా కార్యాచరణ ప్రారంభమైంది. గత పాలకుల నిర్లక్ష్యంతో ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నంగా మారింది. వ్యవస్థలు గాడి తప్పియి. అన్నింటినీ సరిదిద్దుకుంటూ ముందుకు వెళుతున్నాం. ప్రజా ప్రభుత్వ తొలి ప్రాధాన్యత ప్రజా సంక్షేమమే. ప్రజల ఉద్యమ ఆకాంక్షలే ప్రభుత్వ ప్రాధాన్యం. ప్రతి అర్హుడికి సంక్షేమ ఫలాలు అందించడం ప్రభుత్వ బాధ్యతని గవర్నర్ అన్నారు. గత పదేళ్ల పాలకుల వైఫల్యంతో యువతకు ఉపాధి, ఉద్యోగాల విషయంలో నిర్లక్ష్యం జరిగింది. యువత విషయంలో గత ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించింది. టీఎస్పీఎస్సీ ప్రక్షాళన పక్రియ జరుగుతోంది. పక్రియ పూర్తి కాగానే ప్రభుత్వ ఉద్యోగ ఖాళీల భర్తీ పక్రియ ప్రారంభం అవుతుంది. ఈ విషయంలో యువత ఎలాంటి అనుమానాలు, అపోహలకు గురికావద్దు. రైతుల విషయంలో తమ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంది.

వరంగల్ డిక్లరేషన్ అమలుకు కార్యచరణతోపాటు, 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. రైతు భరోసా పథకాన్ని సంపూర్ణంగా అమలు చేయడానికి కసరత్తు జరుగుతోంది. ఇప్పటికే చిన్న సన్నకారు రైతుల ఖాతాలలో రైతు భరోసా నిధులు జమ చేయడం జరిగింది. రూ.2 లక్షల రుణమాఫీకి సంబంధించి బ్యాంకులతో సంప్రదింపులు జరుగుతున్నామని అన్నారు. గత ప్రభుత్వం ఏనాడు సామాన్య లకు అందుబాటులో లేదు. కష్టమొస్తే ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి మొన్నటి వరకు ఉండేది. పేదల కన్నీళ్లు తుడిచే నాథుడు లేని పాలన గతంలో చూశాం. ఇప్పుడు రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలనలో ఉంది. ప్రజా సమస్యలు ఆలకించేందుకు మంత్రులు అందుబాటులో ఉన్నారు. సచివాలయంలోకి సామాన్యుడు వచ్చి ముఖ్యమంత్రిని, మంత్రులను కలిసి సమస్యలు చెప్పుకునే స్వేచ్ఛ వచ్చింది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత తొలిసారి రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణమైన పాలన మొదలైంది. ప్రజల హక్కులను, స్వేచ్ఛను గౌరవించే పాలన తెలంగాణ రాష్ట్రంలో ఉందని చెప్పేందుకు గర్విస్తున్నాను. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో ప్రజా పాలన అడుగులు వేస్తోంది అని' తన గవర్నర్ తమిళి సై సౌందర రాజన్ ప్రసంగించారు.

# ఘనంగా గణతంత్ర వేడుకలు

న్యూఢిల్లీ,జనవరి26 దేశ వ్యాప్తంగా 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మువ్వన్నెల జాతీయజెండా ఆవిష్కరించారు.కర్తవ్యపథ్‌కు చేరుకున్న తర్వాత రాష్ట్రపతి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి.. గౌరవ వందనాన్ని స్వీకరించారు. వేడుకలకి ముఖ్య అతిథిగా ఫ్రాన్స్ దేశాధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మాక్రాన్ హాజరయ్యారు. ముర్ముతో కలిసి మాక్రాన్ సంప్రదాయ గుర్రపు బగ్గీలో వేదిక వద్దకు వచ్చారు. దాదాపు 38 ఏళ్ల తరువాత గణతంత్ర వేడుకల్లో బగ్గీని వినియోగించారు. ఈ కార్యక్రమానికి ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ దంపతులు, ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, నిర్మల సీతారామన్ తదితరులు హాజరయ్యారు. గణతంత్ర వేడుకల్లో భాగంగా ఉదయాన్నే జాతీయ వార్ మెమోరియల్‌ను ప్రధాని సందర్శించి, నివాళులర్పించారు. తరువాత సైనికుల కవాతు, శకటాల ప్రదర్శన, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. సుమారు 13,000 మంది అతిథులు ఈ వేడుకల్లో భాగస్వామ్యమయ్యారు. మొదటిసారి సుమారు 100 మంది మహిళా కళాకారులు భారతీయ సంగీత వాద్య పరికరాలైన ంశంఖం, నాదస్వరం, నగారాలను వినిపించారు. సంప్రదాయ బ్యాండ్‌కు బదులుగా శంఖం, నాదస్వరం,

నగారాతో ప్రదర్శన ఇచ్చారు. మొత్తం మహిళలతో కూడిన ట్రై సర్వీస్ బృందం కర్తవ్య మార్గ్‌లో కవాతు చేయడం ఇదే మొదటిసారి. నారీ శక్తి పేరుతో మహిళా పైలెట్లు, సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ (సిఎపిఎఫ్) మహిళా సిబ్బంది ప్రదర్శనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అనంతరం శకటాలను ప్రదర్శించారు. కర్తవ్యపథ్‌లో రాష్ట్రపతి ముర్ము, మాక్రాన్‌కు ప్రధాని మోదీ స్వాగతం పలికారు. కర్తవ్యపథ్‌లో భారతీయ కళాబృందాలు పరేడ్‌ను ప్రారంభించగా.. 25 శకటాల ప్రదర్శన నిర్వహించాయి. అత్యాధునిక మిలటరీ టెక్నాలజీని భారత్ ప్రదర్శించింది. పరేడ్‌లో ఫ్రాన్స్ సైనిక బలగాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. 20 భీష్మ యుద్ధట్యాంకులు, అధునాతన నాగ్ మిసైల్ సిస్టమ్, పినాక మల్టీ బ్యారెల్ సిస్టమ్ కలర్‌ఫుల్‌గా నిలిచింది. అడ్వాన్స్‌డ్ రేడియో ఫ్రీక్వెన్సీ సిస్టమ్ ప్రదర్శించగా. భారత సైనికశక్తిని మాక్రాన్‌కు ప్రధాని మోదీ వివరించారు. దేశ రాజధాని ఢిల్లీలోని కర్తవ్యపథ్ లో గణతంత్ర వేడుకల పరేడ్‌లో ఆంధ్రప్రదేశ్ శకటం అందరినీ దృష్టిని ఆకర్షించింది..

# లోక్‌సభ ఎన్నికల తరవాత బిఆర్ఎస్ ఔట్

(మొదటి పేజి తరువాయి)

**బీజేపీల మధ్యే ఉందని ఆయన ఉద్ఘాటించారు.** గురువారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి కార్యకర్తలను ఉద్దేశించి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే రాబోయే లోక్‌సభ ఎన్నికలకు మార్గదర్శకాలను సూచించారని ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. 13-14 సీట్లు గెలవడం ద్వారా కేంద్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో తెలంగాణ ముఖ్యమైన పాత్ర పోషిస్తుందన్నారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి పదవిని చేపడతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ పాలన ప్రజలను మోసం చేసి, ప్రజా సంపదను దోచుకుందని, తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. 50 రోజుల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అన్ని శాఖలపై సమీక్షలు నిర్వహించామని, ప్రతి సమీక్షా సమావేశంలో వెల్లడైన అంశాలు దిగ్భ్రాంతికి గురిచేశాయని ఆయన అన్నారు. ముఖ్యంగా నీటి పారుదల, పౌర సరఫరాలు, విద్యుత్, మిషన్ భగీరథ తదితర అన్ని శాఖలు భారీగా అప్పుల్లో కూరుకుపోయాయని ఆయన వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే అన్ని అక్రమాలపై విచారణ ప్రారంభించిందని, అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.94,000 కోట్లకు పైగా ఖర్చు చేశారని, లక్ష ఎకరాలు కూడా లేని ఆయకట్టును సృష్టించారని, ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. అదే విధంగా పాలమూరు రంగారెడ్డికి రూ.25 వేల కోట్లు, సీతారామ ప్రాజెక్టులకు రూ.7 వేల కోట్లు ఖర్చు చేసినా సాగునీరు అందలేదన్నారు. భద్రాద్రి యాదాద్రి పవర్ ప్రాజెక్టుల నిర్మాణంలో జరిగిన అవకతవకలపై కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ చేపట్టిందన్నారు. పేదలకు బియ్యం, సరుకులు అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్న సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఆర్థికంగా చితికిపోయి భారీ అప్పులు చేసి వేల కోట్ల నష్టాల్లో కూరుకుపోయిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. మిషన్ భగీరథ భారీ కుంభకోణమని రూ.40 వేల కోట్లకు పైగా ఖర్చు చేసినా గత బీఆర్ఎస్ హయాంలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు, నీళ్లు ఇవ్వలేక పోయారన్నారు. పైపులైన్లు వేయడం, నీటి వనరుల కల్పన, ఇతర పనుల సాకుతో హడ్కో, నాబార్డు తదితర సంస్థల నుంచి భారీగా రుణాలు తీసుకున్నారని తెలిపారు. కానీ వాస్తవానికి క్షేత్రస్థాయిలో ఏమీ చేయలేదని లోక్‌సభ ఎంపీగా తాను మిషన్ భగీరథపై పార్లమెంట్‌లో ప్రశ్న లేవనెత్తినప్పుడు అప్పులు, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులు తెలుసుకుని దిగ్భ్రాం÷-రతికి గురయ్యానని చెప్పారు. తెలంగాణ వ్యాప్తంగా వేసవి కాలం రాకముందే ప్రజలు నీటి ఎద్దడితో




అల్లాడుతున్నారని, మిషన్ భగీరథ వైఫల్యానికి ఇదే నిదర్శనమని అన్నారు. తాను ఎలాంటి రాజకీయ ఆరోపణలు చేయడం లేదని, మంత్రిగా, కాంగ్రెస్ నేతగా వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావడం తన బాధ్యత అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఎటువంటి పరిణామాలకు భయపడకుండా ప్రజా ధనాన్ని వృధా చేసిందని ఆరోపించారు. వ్యవసాయ రంగానికి 24 గంటల కరెంటు ఇస్తామంటూ బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

యాత్రికుల కోసం వసతి, తాగునీరు, రోడ్లు మరియు సౌకర్యాలతో సహా సౌకర్యాల కల్పనకు ఒక కోటి రూపాయలను కేటాయిస్తున్నామని తెలిపారు. మరో రెండు నెలల్లో పనులు పూర్తి చేసి ప్రతిపాదనలు, అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అన్ని మతాల ప్రజలు ప్రతి సంవత్సరం సందర్శించే జాన్ పహాడ్ దర్గా ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు.

## ఫ్రాన్స్‌లో భారతీయ విద్యార్థులకు పెద్దపీట

న్యూఢిల్లీ,జనవరి26 భారత గణతంత్ర వేడుకలకు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మెక్రాన్ ముఖ్య అతిథిగా విచ్చేసారు. మరింత ఎక్కువ మంది భారత విద్యార్థులు ఫ్రాన్స్‌లో చదువుకునే దిశగా చర్యలు తీసుకుంటామని కీలక ప్రకటన చేశారు. 2030 నాటికి దాదాపు 30 వేల మంది విద్యార్థులను ఆహ్వానించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. భారత విద్యార్థులకు ఫ్రాన్స్ ఏ విధంగా మద్దతు అందించనుందో మెక్రాన్ వివరించారు. ఫ్రెంచ్ మాట్లాడలేని విద్యార్థుల కోసం విశ్వవిద్యాలయాల్లో ప్రత్యేకంగా 'అంతర్జాతీయ తరగతుల'ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. వివిధ సంస్థల భాగస్వామ్యంతో ఒక నెట్‌వర్క్‌ను సృష్టిస్తామని వివరించారు. ఫ్రాన్స్‌లో చదివిన పూర్వ విద్యార్థులకు వీసా సదుపాయం కల్పిస్తామని తెలిపారు. భారత్‌లో రెండు రోజుల పర్యటన కోసం మెక్రాన్ ప్రత్యేక విమానంలో గురువారం జైపూర్ నగరానికి చేరుకున్నారు. శుక్రవారం ఢిల్లీలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి అశ్వరథంలో కూర్చొని సభాస్థలికి వచ్చారు. అనంతరం పెరేడ్ తలకించారు. అంతకు ముందు గురువారం జైపూర్ శివారులోని ఆమెర్ కోటను మెక్రాన్ సందర్శించారు. ప్రధాని మోదీ ఆయనకు హస్తకళల దుకాణంలో అయోధ్య రామమందిర నమూనాను కొనుగోలు చేసి బహూకరించారు. నేతలిద్దరూ సాహూ చాయ్‌వాలా వద్ద మసాలా టీ సేవిస్తూ కబుర్లు చెప్పుకొన్నారు. తర్వాత ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొన్నారు.

## టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మహేందర్‌రెడ్డి



తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌గా మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు సెక్రెటరీ అనితారామచంద్రన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సభ్యులుగా పాల్వాయి రజనీకుమారి, అనితారాజేంద్రతో మహేందర్‌రెడ్డి ప్రమాణం చేయించారు. రెండురోజుల కిందట టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా నియమిస్తూ గవర్నర్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. కొత్తగా చైర్మన్ నియమితులైన మహేందర్‌రెడ్డి ఆ పదవిలో 11 నెలల పాటు కొనసాగనున్నారు.

టీఎస్‌పీఎస్‌పీ నిబంధనల ప్రకారం చైర్మన్‌గా.. కమిషన్ సభ్యులుగా నియమితులైన వారు 62 ఏండ్లు వచ్చేవరకు మాత్రమే పదవిలో కొనసాగేందుకు అవకాశం ఉంది. అలాగే ఆరేళ్ల పాటు మాత్రమే ఆ పదవిలో కొనసాగాల్సి ఉంటుంది. 1962లో డిసెంబర్3న జన్మించిన మహేందర్‌రెడ్డికి ప్రస్తుతం ఆయనకు 61 సంవత్సరాలు. ఇంకో 11 నెలలు ఆయనకు 62 సంవత్సరాలకు చేరుతుంది. ఈ నేపథ్యంలోనే ఆయన 11 నెలల పాటు పదవిలో కొనసాగనున్నారు.

# సంపాదకీయం

## ఉచిత పథకాలపై ప్రజలే నిలదీయాలి !

అధికారం కోసం పాలకులు ప్రజలను ఓటు బ్యాంకుగా చేసుకుని పథక రచన చేస్తున్నారు. ఒకరిని మించి మరొకరు అన్నట్లుగా పథకాలను రూపొందిస్తున్నారు. సంక్షేమం అన్న ముసుగు తగిలించి దేశ, రాష్ట్ర ఖజానాలను గుల్ల చేస్తున్నారు. లక్షల కోట్ల అప్పులు చేస్తున్నారు. ఇలాంటి దుబారా పథకాలను నిలువరించాలి. ప్రజలు కూడా నిలదీయాలి. తమ చేతిక ఇఎముక లేదన్నట్లుగా నగదు జమ చేస్తున్నారు. ఎపిలో అయితే బటన్ నొక్కుడు..నగదు జమచేయడం నిత్యకృత్యంగా మారింది. తెలంగాణలో కూడా గత ప్రభుత్వం దళితబందు, రైతుబంధు వంటి పథకాలతో బొక్కసాన్ని కొల్లగొట్టింది. అధికారం పోయాక ఇప్పుడు అవే పథకాలు అమలు చేయాలంటూ ప్రజలను రెచ్చగొడుతోంది. ఇది అభివృద్ధి, సంక్షేమం ఎలా అవుతుందో చెప్పలేకపోతున్నారు. ఇలాంటి పథకాలపై ప్రజలే నిలదేసేలా చైతన్యవంతులు కావాలి. ప్రజలు చెమటోడ్చి కట్టిన పన్నుల డబ్బులను ఇలా దుబారా చేయడంపై నిలదేసే రోజులు రావాలి. ప్రజలు అభివృద్ధిని కోరుకుంటుంటే..పాలకులు అధికారం కోరుకుంటున్నారు. ఎంతకు తెగించి అయినా అధికారం లోకి రావడమే లక్ష్యంగా అనేకానేక ఉచిత పథకాల హామీలను గుప్పిస్తున్నారు. ఆదాయ వ్యయాలను పరిగణనలోకి తీసుకోకుండా చేస్తున్న విన్యాసాలతో దేశ,రాష్ట్రాల ఆర్థిక ముఖచిత్రం మారిపోతోంది. అభివృద్ధి పడకేస్తోంది. నిరుద్యోగం పెరుగుతోంది. వస్తూత్పత్తి పడిపోతోంది. నిరంతరంగా ఏదో ఒక పథకం పేరుతో నగదు బదిలీలు జరుగుతున్నాయి. దీనికి కాంగ్రెస్, బిజెపిలతో పాటు ప్రాంతీయ పార్టీల నేతలంతా బరి తెగిస్తున్నారు. పేదరికం నుంచి ప్రజలను బయటపడేసే ఉద్దేశ్యంతో చేస్తున్న ఆర్భాటాలతో పథకాలన్నీ బూడిదలో పోసిన పన్నీరు అవుతున్నాయి. 75 ఏళ్లు దాటినా ఇంకా పేదల పేరు చెప్పి రాజకీయం చేస్తున్నారు. ఇలా నగదు బదిలీ పథకాలతో బొక్కసం గుల్ల చేస్తున్నారు. కొత్తగా ఉద్యోగాలు ఇవ్వగలిగే స్థితిలో ఉండడం లేదు. ఉపాధి, ఉద్యోగరంగాలను బలోపేతం చేసే చర్యలు చేయడం లేదు. అలాగే ఆహారధాన్యాల ఉత్పత్తి పెరుగుతున్నా అందుకు అనుగుణంగా వ్యవసాయాధారిత పరిశ్రమలను ఏర్పాటు చేసి ఆదుకోవడం లేదు. ఉన్న పరిశ్రమాలను మూసేస్తున్నారు. లాభాల బాటలో ఉన్న సంస్థలను తెగనమ్మే స్తున్నారు. దేశంలో ప్రజలు అన్నమో రామచంద్రా అంటున్నా పట్టించుకోవడం లేదు. రైతుబంధు, ఉచిత విద్యుత్, ఉపాధిహామీ, కిలోరూపాయి బియ్యంలాంటి పథకాలన్నీ దండగమారివే అయినా కొనసాగి స్తున్నారు. గణతంత్ర వేడుకలు జరుపుకుంటున్న వేళ మార్పునకు నాందీప్రస్తావన కావాలి. పేద ప్రజలకు తాము అధికారం లోకి వస్తే ఉచిత పథకాలతో లబ్దిచేకూరుస్తామని రాజకీయ పార్టీలు, నేతలు, ఎన్నికలవేళ చేస్తున్న వాగ్దానాల పట్ల ప్రజలు అప్రమత్తం కావాలి. ఉచిత వాగ్దానాలు సాధారణ బడ్జెట్‌ను మించి ఉంటున్నా యని, ఇలాంటి జనాకర్షక హామీలు గుప్పించడం తీవ్రమైన అంశమని గుర్తించాలి. గతంలో సుప్రీం ధర్మాసనం కూడా ఇలాంటి అభిప్రయామే వెలిబుచ్చింది. ఇకనుంచైనా ఉచిత వాగ్దానాల వర్షం కురిపించే రాజకీయ పక్షాలను, నేతలను నియంత్రించాల్సిన అవసరం ఉంది. డబ్బులు ఎక్కడి నుంచి తెస్తారో నిలదీయాలి. తెలంగాణలో ఆరు గ్యారెంటీల అమలుకు సంబంధించి ప్రభుత్వానికి అవకాశం లేదు. గత ప్రభుత్వం చేసిన అప్పుల నుంచి బయటపడడం ఎలా అన్నదే ప్రస్తుతం ఉన్న సమస్య. ఎన్నికలకు ముందు ప్రజానిధులతో ఉచిత తాయిలాలు ప్రకటిస్తూ, ఉచిత హామీలిస్తున్న పార్టీల ఎన్నికల గుర్తును స్తంభింపజేయాలని, రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని గతంలో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. అయినా ఎలాంటి చర్యా తీసుకోలేదు. త్వరలో పలు రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికల ముందు మరోమారు ఈ సమస్య చర్చ కావాలి. ఉచితాలపై ప్రజలే నిలదీయాలి. మనకెందుకు లే

అని అనుకుంటే మనలను నిండా ముంచుతారు. అందుకు తెలంగాణలో కెసిఆర్ ఏలుబడే చక్కటి ఉదాహరణ. ఎపిలో జగన్ పాలన కూడా అందుకు ఉదాహరణెళి. రాజకీయ పార్టీలు ఉచిత వాగ్దానాలతో ఓటర్లను ప్రలోభ పెడుతున్న తీరును ప్రజలు చైతన్యవంతులయి ఎక్కడిక్కడ నిలదీయాలి. ఈ ఎన్నికల్లోపే ఇది చేయగలమా? వచ్చే ఎన్నికల వరకైనా చేయగలమా? అన్నది ఆలోచించాలి. ఉచిత హామీలకు అయ్యే ఖర్చు సాధారణ బడ్జెట్‌ను మించిపోతోందని గతంలో సుప్రీం సిజె గా పనిచేసిన జస్టిస్ ఎన్‌వి రమణ చేసిన వ్యాఖ్యలు మననం చేసుకోవాలి. ఓటర్ల నుంచి రాజకీయ లబ్ది పొందటం కోసం అనుసరిస్తున్న జనాకర్షణ విధానాలు పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం. దీనిపై నిషేధం విధించాల్సి ఉంటుందని కూడా అప్పట్లో ఆయన అభిప్రాయపడ్డారు. ఇది చాలా తీవ్రమైన సమస్య అంటూ...మార్గదర్శకాలను రూపొందించాలని గతంలో ఎన్నికల సంఘానికి సూచించిన విషయాన్ని ప్రస్తావించారు. ఇందుకు అనుగుణంగా ఎన్నికల కమిషన్ తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఎన్నికల సంఘం కూడా తనకుతాను నియమావళిని నిర్దేశించుకుని రాజకీయ పార్టీలను కట్టడి చేయాల్సి ఉంది. అధికారం కోసం... అధికార వనరులపై పెత్తనం కోసం రాజకీయ పార్టీలు చేస్తున్న విన్యాసాలే ఈ ఉచిత పథకాలుగా చెప్పుకోవాలి. ఎపిలో నిరంతరాయంగగా డబ్బుల పంపిణీ కార్యక్రమం మనకు కళ్లకు కనపడుతోంది. జగన్ తనతాత ముత్తాతలు సంపాదించిన ఆస్తి నుంచి పంచి పెడుతున్నట్లుగా ఎపిలో బొక్కసం ఖాళీ చేస్తున్నారు. కెసిఆర్ కూడా అప్పులతో ఆస్తులు సృష్టించానని చెప్పి తెలంగాణను అప్పుల కుప్పగా తయారు చేశారు. ఈ అప్పులు తేర్చడానికి వేలకోట్లు వడ్డీలకే చెల్లించాల్సి రావడం దారుణం కాక మరోటి కాదు. ఇలాంటి నేతలను నమ్మితే మనలను మనం అంగట్లో అమ్ముకోవడం తప్ప మరోటి కాదు. అధికారంలోకి రావడానికి పథకాలు ప్రకటించడం.. అధికారం లోకి వచ్చాక దానిని నిలుపుకోవడానికి నగదు బదిలీ పథకాలు ప్రవేశ పెట్టడం బాగా అలవాటు చేసుకున్నారు. ప్రజలు చెమటోడ్చి పన్నులు కడితే అభివృద్ధి పనులతో సంపదను సృష్టించాల్సిన నేతలు సంపదనలు హారతి కర్పూరంలా హరించి వేస్తున్నారు. మోడీతో సహా కెసిఆర్, జగన్, మమతా బెనర్జీ, కేజ్రీవాల్ లాంటి సిఎంలంతా ఇందుకు అతీతులు కాదు. ఏదో విధంగా అధికారాన్ని కాపాడు కోవాలన్న లక్ష్యంతో చేస్తున్న పథకాల కారణంగా ప్రజలు నష్టపోతున్నారు.

# దుబారా పథకాలపై సమీక్షలేవీ

## ఉచిత పథకాలతో వేలకోట్లు వృథా -అప్పల భారం పట్టించుకోని పాలకులు




హైదరాబాద్,జనవరి26 ప్రత్యేక తెలంగాణ ఏర్పడక ముందు నీళు ్లు..నిధులు..నియామకాలు అంటూ ఊదరగొట్టిన కెసిఆర్..తన పాలనా కాలంలోతెలంగాణలో ఈ మూడు లక్ష్యాలు నెరవేరాయని, బంగారు తెలంగాణ అయ్యిందని ప్రకటించుకున్నారు. కానీ కొత్త ప్రభుత్వం వచ్చాక కానీ తెలియలేదు.. తెలంగాణను అప్పుల కుప్పగా చేశారని..తెలంగాణ అంతా బంగారుమయం అయ్యిందన్న భావనలో ప్రజల్లో భ్రమలు కల్పించారు. అడక్కుండానే కాళేశ్వరం కట్టి అది ప్రజలకోసమే అన్నారు. అలాగే ఉచిత విద్యుత్ దుబారాను అరికట్ట లేదు. రైతుబంధు ముసుగులో వేలకోట్ల దుర్వినియోగాన్ని ఆపలేదు. దళితబంధు పేరుతో వందలకోట్లు పంచిపెట్టేశారు. రూపాయికే కిలో బియ్యం పథకం దుబారాను ఏ ప్రభుత్వం కూడా అరికట్టడం లేదు. కాంగ్రెస్ కూడా దీనిని కదుపుతుందా లేదా అన్నది చూడాలి. రైతులు గిట్టుబాటు ధరలు కావాలన్నా..ధాన్యం కొనుగోళ్లు చేయాలన్నా సవాలక్ష కొర్రీలు పెడుతున్నారు. అంటే పథకాలన్నీ ఓట్లను రాల్చేలా ప్రవేశ పెట్టడం నేర్చుకున్నారు. ధనిక రాష్ట్రం కాస్తా ఇప్పుడు అప్పుల ఊబిలో మునిగిందని తెలుసుకునే వరకు సమయం మించిపోయింది. ఉచిత పథకాలతో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోతున్నా పాలకులు మేల్కోవడం లేదు. ఇక్కడ కెసిఆర్, ఎపిలో జగన్ చేతికి ఎముక లేదన్న చందంగా అటుఇటుగా ఒకే తరహా పథకాలతో ప్రజల్లో దానకర్ణుడిలా పోజులు పెడుతున్నారు. ప్రత్యేక విమానాల్లో విహరించడం మొదలు అధికారం కోసం ప్రజల డబ్బును నీళ్ల ప్రాయంగగా ఖర్చు చేస్తున్నారు. ఎన్నికల్లో లబ్ది కోసమే దళితబంధు పథకాన్ని ప్రారంభిం చారు. దళితబంధు మాత్రమే కాదు.. రైతుబంధు, 24 గంటల ఉచిత విద్యుత్తు, కల్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్లు, పంటరుణాల మాఫీ, రైతుబీమా.. కిలో రూపాయికే బియ్యం వంటివన్నీ ఉచిత పథకాలే. ఎన్నికల సందర్భాల్లోనో, ఇతర రాజకీయ పరిస్థితుల్లోనో ప్రజలను ఆకర్షించేందుకు కేసీఆర్ ఇచ్చిన హామీల మేరకు అమలు చేస్తున్నవే. వీటిలో అనుత్పాదక ఉచిత పథకాలతో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయింది. ఇప్పటికే రాష్ట్ర అప్పులు దాదాపుగా మూడు ఆరు లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఉచిత పథకాల నిధుల భారంతో భారం తడిసి మోపెడు అవుతోంది. నగదు బదిలీలు అంతాఇంతా కాదు. ఎన్నికల్లో గెలవడమే లక్ష్యంగా వేల కోట్ల రూపాయలతో కొత్త కొత్త పథకాలు తెరమీదకు తెస్తోంది. కేసీఆర్ రాక ముందు కూడా రాష్ట్రంలో పలు సంక్షేమ పథకాలు ఉన్నాయి. వాటికి కేసీఆర్ జోడించిన కొత్త పథకాల బరువు ఏటా రూ.45 వేల కోట్ల పైమాటేనని లెక్కలు చెబుతున్నాయి.. రైతులకు పెట్టుబడి సాయం చేయాలన్న ఉద్దేశంతో 'రైతుబంధు' పథకాన్ని ప్రవేశపెట్టారు. ఎకరానికి రూ.10 వేలు ఇచ్చారు. ఏడాదికి రూ.14 వేల కోట్లకు పైగానే ఖర్చవుతోంది. దీనికి ఎలాంటి పరిమితులు విధించకపోవడంతో వేలకోట్లు దుబారా అయ్యాయి. వందల ఎకరాలున్న ఆసాములు కూడా ఆర్థిక సాయానికి అర్హు లే అన్నట్లుగా పథకం సాగింది. పరిమితి విధించాలంటూ చాలాకాలం నుంచి డిమాండ్లు ఉన్నా పట్టించుకోలేదు. మంత్రి మల్లారెడ్డి కూడా తనకు 600 ఎకరాలున్నాయంటూ ప్రకటించారు. ఇలాంటి మోతుబరి కూడా రైతుబంధును మెక్కేశారు. రైతుబంధును ఎలాగైనా ముందుకు నడిపించే పట్టుదలలో వ్యవసాయ రంగానికి సంబంధించిన ఇతర సబ్సిడీ పథకాలను కొండెక్కించి, రైతు బంధుకు మళ్లించారు. ఉచిత విద్యుత్ భారం ప్రభుత్వంపై పలు రెట్లు పెరిగింది. 10 బోర్లు ఉన్న పెద్ద రైతులకు కూడా ఉచి త విద్యుత్తు అందించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్న ఉదయి స్తోంది. పేద యువతుల పెళ్లిళ్ల కోసం కల్యాణలక్ష్మి కింద ఏటా 3 వేల కోట్లు ఖర్చు పెడుతున్నారు. దళితబంధు మరో ఉచిత నగదు పంపిణీ పథకంగా చూడాలి. ఒక్కో దళిత కుటుంబానికి రూ.10 లక్షల నగదును పంపిణీ చేసారు. పథకాల కోసం చేస్తున్న అప్పులు, వడ్డీల సంగతి సరేసరి. దాంతో ఇతర పథకాలకు, అభివృద్ధి కార్యక్రమాలకు డబ్బులకు కటకట ఏర్పడింది. దీనికితోడు నిరుద్యోగ సమస్య వెన్నాడుతోంది. కిలో రూపాయి బియ్యం పథకం, రైతుబంధు తదితర పథకాలను తక్షణం సమీక్షించాల్సిన సమయం ఆసన్నమైంది. లేకుంటే మరింత ఆర్థిక బారం తప్పేలా లేదు.

# చట్టంతో ఉచిత పథకాలకు చెక్

## కేంద్రప్రభుత్వమే చొరవ తీసుకోవాలి - రాజకీయ నిపుణులు, మేధావుల అభిప్రాయం

న్యూఢిల్లీ,జనవరి26
రాజకీయ పార్టీలు అధికారం కోసం లేదా..అధికారం కాపాడుకోవడానికి ప్రకటించే ఉచిత పథకాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వమే చొరవ తీసుకుని కొత్త చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని నిపుణులు, ఆర్థికవేత్తలు సూచిస్తున్నారు. కేంద్రంలోని ప్రభుత్వం కూడా ఉచిత పథకాలను సమీక్షించి చట్టం చేయకుంటే దేశం దివాళా తీస్తుందని హెచ్చరిస్తున్నారు. ఉచిత పథకాలను ఇలాగే కొనసాగిస్తే కొంపముంచుతాయని హెచ్చరిస్తున్నారు .బ్యాంకులను ముంచి పారిపోయిన నీరవ్ మోడీ, విజయ్ మాల్యాల లాగే వ్యవహరిస్తే బ్యాంకుల దివాళా లాగా దేశం కూడా దివాళా తీస్తుందని అంటున్నారు. ముఖ్యంగా పథకాలకు పరిమితులు విధిస్తూ నిబంధనలు పెట్టాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. అనుత్పాదక వ్యయాలు కాకుండా.. ఉత్పాదక వ్యయాల విషయంలోనే పథకాలను అమలు చేస్తే బాగుంటుందని అంటున్నారు. ఇకపోతే పనిదినాలు కల్పించాలని చేపట్టిన ఉపాధిహామీ పథకం కూడా దివాళా పథకంగా మారింది. వేలకోట్లు ఖర్చు చేస్తున్నా సమగ్రంగా పనులు జరగడం లేదు. తెలుగు రాష్ట్రాల తో పాటు ఢిల్లీ, పంజాబ్, బెంగాల్ తదితర రాష్ట్రాల్లో అనుత్పాదక పథకాలకు వేల కోట్ల రూపాయలను వెచ్చించాల్సి వస్తుండడంతో మౌలిక సదుపాయాల కల్పన పడకేస్తోంది. అలాగే పథకాలను కొనసాగిం చేందుకు వేలకోట్లు అప్పులు చేయాల్సి వస్తోంది. ఉచిత టీవీలు, ల్యాప్‌టాప్‌లు, సైకిళ్లు, కుట్టు మిషన్లు ఇలా అనేకానేక వస్తువులు ఇస్తామంటున్న పార్టీలు రేపు ఉచితంగా మద్యం, 10 గ్రాముల బంగారాన్ని పంపిణీ చేస్తామంటూ పథకాలను ప్రవేశపెట్టినా ఆశ్చర్య పడాల్సిన అవసరం లేదు. ప్రజలకు ఉచితంగా ఇవ్వద్దని రాజ్యాంగంలో ఎక్కడా చెప్పలేదు. కాబట్టి అన్ని పార్టీల ప్రభుత్వాలు ఉచిత పథకాలను జోరుగా అమలు చేస్తున్నాయి. ఇలాంటి వాటిని కేంద్ర ఎన్నికల సంఘం కట్టడి చేయలేదు. అందుకే కేంద్ర ప్రభుత్వమే జోక్యం చేసుకుని కట్టడి చేసేలా ఒక కొత్త చట్టాన్ని అమల్లోకి తేవాల్సిన అసవరం ఏర్పడిందని మేధావులు సూచిస్తున్నారు. విద్య, వైద్యం వంటి పేదల సంక్షేమానికి సంబంధించిన రంగాల్లో ఉచితాల అసవరం ఉంది. వీటికి డబ్బులు వెచ్చించాల్సిందే. ఉచిత పథకాలకు పరిమితులు ఉండాలని రాజకీయ నిపుణులు సైతం సూచిస్తున్నారు. పన్నుల ద్వారా ప్రజల నుంచి వసూల్లు చేసిన డబ్బును ఉచిత పథకాలకు కేటాయిస్తూ.. మౌలిక సదుపాయాలకు రాష్ట్రాలు అప్పులు చేస్తున్నాయి. ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితికి మించి అప్పు కోసం కేంద్రాన్ని దేబిరిస్తున్నాయి. ఉచిత పథకాలకు నిధులను ధారపోయకుండా ఇలాంటి మౌలిక సదుపాయాలకు వెచ్చిస్తే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అంటున్నారు. ఈ క్రమంలో కేంద్రం చట్టం చేసి పరిమితులు విధించేలా రాజ్యాంగ సవరణలు చేయాలని అంటున్నారు.

# రిపబ్లిక్‌డే సందర్భంగా భారత్‌కు శుభాకాంక్షలు తెలిపిన మయిజ్జు





75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు భారత్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఓ పక్క దిల్లీ-మాలెల మధ్య దౌత్య వివాదం వేడెక్కిన వేళ ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.
ఈ సందర్భంగా ఇరుదేశాల స్నేహ సంబంధాలను ఆయన ప్రస్తావించారు.
"భారత రాష్ట్రపతి, ప్రధానికి మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.
ఈమేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీలకు వేర్వేరుగా సందేశాలు పంపారు. రానున్నకాలంలో భారత ప్రజలు శాంతి, అభివృద్ధి, సంపదతో తులతూగాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా ఇరు దేశాల మధ్య కొన్ని వందల ఏళ్లుగా ఉన్న స్నేహాన్ని, పరస్పర గౌరవాన్ని, బంధాన్ని ఆయన గుర్తుచేసుకొన్నారు" అని ఆ దేశ అధ్యక్ష కార్యాలయం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొంది.మాల్దీవుల మాజీ అధ్యక్షుడు, భారత మిత్రుడు ఇబ్రహీం సోలీ కూడా గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఇరు దేశాల మధ్య విడదీయరాని బంధం ఉందన్నారు. భవిష్యత్తులో ఇది మరింత బలపడాలని ఆయన ఎక్స్‌లో పోస్టు చేసిన సందేశంలో ఆకాంక్షించారు. గతేడాది మాల్దీవుల్లో ఎన్నికల అనంతరం ముయిజ్జు ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఇరుదేశాల మధ్య సంబంధాల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకొన్నాయి. ఇటీవల ఆ దేశానికి చెందిన ముగ్గురు మంత్రులు మన ప్రధానిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం వివాదాస్పదంగా మారింది. ఆ తర్వాత వారిని పదవి నుంచి తప్పించి మాలె నష్ట నివారణ చర్యలు చేపట్టింది. మరోవైపు ఆ దేశంలో ఉన్న భారత సైనిక దళాలను వెనక్కి తీసుకోవాలని నూతన ప్రభుత్వం డిమాండ్ చేసింది. న్యూదిల్లీ కూడా ఈ దిశగా చర్యలు తీసుకొంటోంది. మరోవైపు ఆ దేశ విపక్షాలు మాత్రం భారత్‌ను దూరం చేసుకోవడం దేశానికే హానికరమని ఆందోళన వ్యక్తంచేశాయి. ఈ మేరకు 'మాల్దీవియన్ డెమొక్రటిక్ పార్టీ (%వీణా%)', ది డెమొక్రాట్స్ అక్కడి ప్రభుత్వాన్ని హెచ్చరించాయి. భారత్‌ను దీర్ఘకాల మిత్రుడిగా అభివర్ణిస్తూ ఈ వ్యాఖ్యలు చేశాయి. ఎప్పటినుంచో అనుసరిస్తున్నట్లుగా అన్ని అభివృద్ధి భాగస్వామ్య పక్షాలతో మాల్దీవులు కలిసి పనిచేయాలంటూ మారుతున్న 'విదేశాంగ విధాన వైఖరి'ని ఎత్తి చూపాయి. హిందూ మహాసముద్రంలో శాంతి, సుస్థిరతలు మాల్దీవుల భద్రతకు చాలా కీలకమని గుర్తుచేశాయి.

## పాలకులు వ్యవస్థలను గౌరవించాలి

### కోర్టులు జోక్యం లేకుండా చేయాలి

అమరావతి,జనవరి26: ప్రజాస్వామ్యంలో వ్యవస్థలే కీలకం. అవి సక్రమంగా పనిచేసేలా పాలకులు చూడాలి. వ్యవస్థలను రూపొందించిన పాలకులు వాటిని నిర్వీర్యం చేయడమో లేదా వాటిని పనిచేయకుండా చేయడమో జరుగుతోంది. దేశంలో ఇలాంటి అనాగరిక చర్యలు అప్పుడప్పుడు జరుగుతున్నాయి. అయితే సకాలంలో కోర్టులు రంగప్రవేశం చేసి వ్యవస్థకు రక్షణగా నిలుస్తున్నాయి.
చట్టాలను పనిచేసుకునేలా చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితి ఎపిలో గత స్థానిక ఎన్నికలకు సంబంధంచిన వ్యవహారమే నిదర్శనం. అధికారం ఉంది కదా అని ఇష్టం వచ్చినట్లుగా ఆటలాడారు. రాజధాని మార్చడంతో సహా అనేక కార్యక్రమాలను చూస్తున్నాం. కోర్టుల చుట్టూ తిరిగారు. ఎన్నుకున్న ప్రభుత్వాలు ఖచ్చితంగా తమ విధులు నిర్వహించేలా రాజ్యాంగబద్ధ వ్యవస్థ కావాలి. ఏప్రభుత్వం ఉంటే ఆ ప్రభుత్వానికి కొమ్ము కాయడం, డబ్బాకొట్టడం అలవాటు చేసుకున్న అధికారులు రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కుతు న్నారు. చట్టానికి, న్యాయానికి విలువనివ్వక పోవడం అనేక సందర్భాల్లో చూశాం. తమకు అనుకూల విధానాలు అవలంబించాలన్న దుందుడుకు రీతిలో ఉండరాదని తెలుసుకోవాలి. ప్రజాస్వామ్యంలో అధికారం అన్నది ఓ వ్యవస్థ మాత్రమే. మిగతా వ్యవస్థలు ఉంటాయని వాటిని గౌరవించా లని గుర్తించాలి. పాలన అన్నది ప్రజల కోసమే అన్నది గుర్తెరగాలి. తమ అధికారంలో ఉంటూ.. తరవాతి తమవారు అధికారంలో ఉండేలా వ్యవస్థలను బలహీనపరిస్తే తగిన గుణపాఠం తప్పదని గుర్తించాలి. ఇంతకాలం రాజకీయ ప్రత్యర్థులను వెంటాడి వేధించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ ఇప్పుడు స్వీయ విధ్వంసానికి పాల్పడుతున్నారా? అన్న అనుమానం కలుగుతున్నది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాజధాని లేని రాజ్యంగా ఎపి మగిలింది. అనేక రంగాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. దేశానికి రైతులు ఆహార భద్రత అందిస్తుంటే, సైనికులు సరిహద్దుల్లో దేశ రక్షణ కోసం గస్తీ కాస్తున్నారు. దేశంలో అన్నదాతలు ఆందోళన చేస్తున్న వేళ..వారిగురించి చర్చ చేయడం ద్వారా ప్రభుత్వం ఓ మంచి సందేశం ఇవ్వగలగాలి.
నిపుణలతో చర్చించి వారికి ఎలా చేస్తే న్యాయం జరగగలదో ఆలోచన చేయాలి. అన్నదాతలను నిత్యం మననం చేసుకుంటున్న మనం వారికి న్యాయం చేసే విషయంలో ముందుండాలి. అకాల వర్షాలు, ప్రకృతి విపత్తులతో నష్టపోతున్నా పట్టించుకోవడం లేదు. గిట్టుబాటు ధరల కోసం ఏటా యుద్ధం చేయాల్సి వస్తోంది. రైతుల ఆత్మహత్యలను సీరియస్‌గా తీసుకోవాలి. పంటల వేళ వారికి మద్దతు ధరలతో అండగా నిలవాలి. కొన్న పంటలకు సకాంలో డబ్బులు చెల్లించే స్థితి ఉండాలి.

## రాజకీయాల్లో ఎవరికీ తలుపులు శాశ్వతంగా మూసి ఉండవు: సుశీల్ మోదీ



పట్నా: బిహార్ సీఎం నీతీశ్ కుమాం మళ్లీ ఎన్డీయేకు దగ్గరవుతున్నారనే ప్రచారం జోరుగా సాగుతున్న వేళ భాజపా సీనియర్ నేత సుశీల్ కుమార్ మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు.రాజకీయాల్లో ఎవరికీ శాశ్వతంగా తలుపులు మూసి ఉండవని పేర్కొన్నాు. కర్పూరీ ఠాకూర్ శతజయంతి వేడుకల్లో నీతీశ్ కుమార్ వారసత్వ రాజకీయాలపై వ్యాఖ్యలు చేయడం.. వాటిని లాలూ కుమార్తె రోహిణి ఆచార్య తప్పుబట్టడం వంటి పరిణామాలతో నీతీశ్ ఆర్జేడీ-కాంగ్రెస్‌తో దోస్తీ వీడి మళ్లీ ఎన్డీయే కూటమిలో చేరుతున్నట్లు ప్రచారం జోరందుకుంది. ఈ పరిణామాలతో బిహార్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఈనేపథ్యంలో భాజపా నేత సుశీల్‌కుమార్ మోదీ పట్నాలో మీడియాతో మాట్లాడారు. "నీతీశ్‌కైనా, జేడీయూకైనా గానీ రాజకీయాల్లో తలుపులు శాశ్వతంగా మూసి ఉండవు.. సమయం వచ్చినప్పుడు మూసివేసిన తలుపులు తెరుచుకుంటాయి. అయితే, తలుపులు తెరవాలో, లేదో మా కేంద్ర నాయకత్వం నిర్ణయిస్తుంది" అన్నారు.

శనివారం 26 జనవరి 2024 జర్నలిస్ట్ వార్త

# బ్లడ్ బ్యాంక్‌లో జెండా ఎగరేసిన చిరంజీవి

హైదరాబాద్,జనవరి26 దేశవ్యాప్తంగా 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో మోగాస్టార్ చిరంజీవి బ్లడ్ బ్యాంకులో జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎందరో మహనీయుల తాగ్యఫలం వల్లే ఈ రోజు మనం స్వేచ్ఛగా బ్రతకగలగుతున్నామని అన్నారు. ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం తనకు ఎంతో ప్రత్యేకమైనదని, పద్మవిభూషణ్ అవార్డు ఇచ్చారన్నారు. 2006లో తనకు పద్మభూషణ్ అవార్డు ఇచ్చినప్పుడు అదే ఎంతో గొప్ప విషయంగా భావించానని, ఇప్పుడు పద్మవిభూషణ్ ఇస్తారని ఊహించలేదన్నారు. ఈ పురస్కారానికి తనను ఎంపిక చేసినందుకు కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చిరంజీవి చెప్పారు. కాగా రాజకీయాల్లో.. సినిమాల్లో.. ఇలా రెండు వేర్వేరు రంగాల్లో ఎలాంటి నేపథ్యమూ లేకుండా అతి సామాన్యులుగా ప్రస్థానాన్ని ప్రారంభించి, తమ స్వయంకృషితో, అద్భుత ప్రతిభతో అత్యున్నత స్థానాలకు ఎదిగిన ఇద్దరు అసామాన్యులైన తెలుగు తేజాలను పద్మవిభూషణ్ పురస్కారం వరించింది. వారిలో ఒకరు మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు కాగా.. మరొకరు తెలుగు చిత్రపరిశ్రమలో మెగాస్టార్‌గా వెలుగొందుతున్న చిరంజీవి. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని.. 2024కుగాను పద్మ పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం గురువారం రాత్రి ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం తనను పద్మవిభూషణ్ కు ఎంపిక చేసినందుకు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ఎక్స్ (ట్విటర్) వేదికగా శుక్రవారం ఓ వీడియోను విడుదల చేశారు. పద్మవిభూషణ్ అవార్డు వచ్చిందని తెలిసిన క్షణం ఏం మాట్లాడాలో, ఎలా స్పందించాలో తెలియని పరిస్థితి. మనదేశంలో రెండో అత్యున్నత పౌరపురస్కారం పద్మవిభూషణ్ లభించినందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. ఒక తల్లికడుపున పుట్టకపోయినా, నన్ను తమ సొంతమనిషిగా, మీ అన్నయ్యగా, మీ బిడ్డగా భావించే కోట్లాది మంది ప్రజల ఆశీస్సులు, నా సినీ కుటుంబం అండదండలు, నీడలా నాతో ప్రతినిమిషం నడిచే లక్షలాది మంది అభిమానుల ప్రేమ, ఆదరణ కారణంగానే ఈరోజు నేను ఈ స్థితిలో ఉన్నాను. నాకు దక్కినటువంటి ఈ గౌరవం మీది. మీరు నాపై చూపిస్తున్న ప్రేమ, ఆప్యాయతలకు నేను ఏమిచ్చి రుణం తీర్చుకోగలను. నా 45 ఏళ్ల సినీ



ప్రస్థానంలో వెండితెరపై వైవిధ్యమైన పాత్రల ద్వారా వినోదం పంచడానికి శక్తిమేరకు ప్రయత్నిస్తూనే ఉన్నాను. నిజజీవితంలో కూడా నా చుట్టూ ఉన్న సమాజంలో అవసరమైనప్పుడు నాకు చేతనైన సాయం చేస్తూనే ఉన్నాను. కానీ నాపై చూపిస్తున్న కొండంత అభిమానానికి ప్రతిగా ఇస్తున్నది గోరంతే. ఈ నిజం నాకు ప్రతిక్షణం గుర్తుకువస్తూనే ఉంటుంది. నన్ను బాధ్యతగా ముందుకు నడిపిస్తుంటుంది. నన్ను ఈ ప్రతిష్ఠాత్మకమైన పద్మవిభూషణ్ అవార్డుకు ఎంపిక చేసిన భారత ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీ గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు అని చిరంజీవి పేర్కొన్నారు.

# ఘనంగా గణతంత్ర వేడుకలు

అమరావతి,జనవరి26: 75వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని రాష్ట్ర అసెంబ్లీ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర శాసన సభాపతి తమ్మినేని సీతారాం జెండా ఆవిష్కరించారు. ముందుగా జాతిపిత మహాత్మాగాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పిదప మువ్వన్నెల జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశమంతా 75వ గణతంత్ర దినోత్సవాలను జరుపుకుంటున్నశుభ దినాన ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. రాజ్యాంగ స్పూర్తికి అనుగుణంగా రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక సంక్షేమ అభివృద్ధి పథకాలను చిత్తశుద్ధితో అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో అసెంబ్లీ సెక్రటరీ జనరల్ డా.పిపిపికె. రామాచార్యులు,ఉప కార్యదర్శులు సుబ్బరాజు,విజయరాజు ,చీఫ్ మార్షల్ డి.ఏడుకొండల రెడ్డి,లీగల్ అడ్వయిజర్ ఎం.చంద్రశేఖర్, పలువురు అసెంబ్లీ అధికారులు,ఉద్యోగులు, ఎస్పిఎఫ్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. రాజ్యాంగ స్పూర్తికి అనుగుణంగా పాలనసాగుతోందని కౌన్సిల్ చైర్మన్ మోషేన్ రాజు అన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం రాష్ట్ర అసెంబ్లీ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ముందుగా జాతిపిత మహాత్మాగాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి మువ్వన్నెల జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం 75వ గణతంత్ర దినోత్సవ వేడుకులను జరుపుకుంటున్న తరుణంలో రాష్ట్ర ప్రజలందరికీ హార్ధిక శుభాకాంక్షలు తెలియజేశారు. సుమరు 300 ఏళ్ళ పాటు బ్రిటిష్ వలస పానలకు చరమ గీతం పలికి సర్వసత్తాక ప్రజాస్వామ్య దేశంగా ప్రకటించబడిన శుభదినం నేడని అన్నారు. నేడు పరిపాలన ఇంత సాఫీగా సాగుతోందంటే అందుకు మన రాజ్యాంగం దాని స్పూర్తే కారణమని పేర్కొన్నారు. ముఖ్యంగా మన రాష్ట్రంలో రాజ్యాంగ స్పూర్తికి అనుగుణంగా అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించే దిశలో పాలన సాగడం చాలా ఆనందంగా ఉందని చైర్మన్ మోషేన్ రాజు అన్నారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని కలిగిన మన దేశంలో అన్ని వర్గాల వారికి సమాన అవకాశాలను కల్పించి పాలన సాగించడం ప్రజాస్వామ్య స్పూర్తికి ఇదే ప్రత్యక్ష నిదర్శనం అన్నారు. ముఖ్యంగా బడుగు బలహీన వర్గాలకు పలు సంక్షేమ పథకాలు అమలుతో పాటు విద్యా,వైద్య పరమైన సౌకర్యాలు పూర్తి స్థాయిలో ఒదించడం నిజమైన ప్రజాస్వామ్య స్పూర్తికి నిలువెత్తు నిదర్శనమన్నారు. 75వ గణతంత్ర దినోత్సవ వేళ విజయవాడలో రాజ్యాంగ నిర్మాత డా.బిఆర్ అంబేద్కర్ వారి 206 అడుగుల ఎత్తుతో కూడిన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి శాసన మండలి అధ్యక్షులు మోషేన్ రాజు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో అసెంబ్లీ సెక్రటరీ జనరల్ డా.పిపిపికె.రామాచార్యులు, ఉప కార్యదర్శులు విజయరాజు,సుబ్బరాజు,చీఫ్ మార్షల్ ఎ.మురళి,లీగల్ అడ్వయిజర్ ఎం.చంద్రశేఖర్,ఇతర అధికారులు ఉద్యోగులు,ఎస్పిఎఫ్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి, కాంగ్రెస్ పార్టీలు ఒక్కటే

హైదరాబాద్,జనవరి26: అధికార కాంగ్రెస్ పార్టీ, బీజేపీలపై మాజీ మంత్రి హరీష్‌రావు మరోసారి ఫైర్ అయ్యారు. ఎక్స్ వేదికగా ఇరు పార్టీలపై విరుచుకుపడ్డారు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకం వ్యవహారంపై స్పందిస్తూ.. కాంగ్రెస్, బీజేపీల రహస్యమైత్రి మరోసారి బయటపడిందన్నారు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంలో రెండు పార్టీల మధ్య ఉన్న అవగాహన బట్టబయలు అయిందన్నారు. బీజేపీ ఎజెండాకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీకి మేలు చేసే విధంగా గవర్నర్ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాజకీయ పార్టీల్లో కొనసాగుతున్నారనే కారణంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం సిఫారసు చేసిన అభ్యర్థులను ఎమ్మెల్సీలుగా నియమించడానికి ఈ గవర్నర్ నిరాకరించా రన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా ఓ రాజకీయ పార్టీ అధ్యక్షుడినే సిఫారసు చేస్తే గవర్నర్ ఆమోదించారన్నారు. ఇది ద్వంద్వ నీతి కాదా కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా గవర్నర్ వ్యవహరించడం కాదా ? గతంలో కూడా క్రీడా, సాంస్కృతిక , విద్యా సామాజిక , సేవ రంగాల్లో కృషి చేసిన వారిని బీఆర్ఎస్ ప్రభుత్వం ఎమ్మెల్సీలుగా సిఫారసు చేసింది. అప్పుడు కూడా గవర్నర్ రాజకీయ కారణాలతో వాటిని ఆమోదించలేదు. మరి ఇప్పుడు ఎందుకు ఆమోదించారని అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ , బీజేపీ రెండు పార్టీలు ఒక్కటై బీఆర్ఎస్ పార్టీని అణగదొక్కాలని చూస్తున్నాయన్నారు. ఈ కుట్రలో గవర్నర్ స్వయంగా భాగస్వామి కావడం అత్యంత దురదృష్టకరమన్నారు. న్యాయ సూత్రాలు, రాజ్యాంగ సాంప్రదాయాలు అన్ని పార్టీలకు ఒకే రకంగా ఉండాలని.. కానీ బీఆర్ఎస్‌కు, కాంగ్రెస్‌కు తేడా చూపిస్తున్నారని హరీష్‌రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

## బిఆర్ఎస్‌కు కాంగ్రెస్‌కు తేడా లేదు

పార్టీ కార్యాయలంలో గణతంత్ర వేడుకల్లో లక్ష్మణ్

హైదరాబాద్,జనవరి26: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన తీరుపై భారతీయ జనతా పార్టీ విమర్శించింది. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఉన్నట్టే ఇప్పుడు రాష్ట్రంలో పరిస్థితులు ఉన్నాయని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. సీఎం రేవంత్ పాలనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రిపబ్లిక్ డే వేడుకల్లో చింతా సాంబమూర్తి, కాశం వెంకటేశ్వర్లు, బండా కార్తీక రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రధాని మోదీ మందు చూపుతో దేశాన్ని అభివృద్ధి చేస్తున్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా దేశంలో మోదీ పాలన సాగుతుంది. కాంగ్రెస్ హయాంలో మాత్రం దళారి పాలన కొనసాగింది. తెలంగాణ రాష్ట్రంలో గ్యారెంటీ, ఉచితల పేర్లతో ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోంది. పేదలకు శాశ్వత ప్రయోజనం కల్పించాలనే చిత్తశుద్ధి ఆ పార్టీకి లేదు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో డబుల్ ఇంజన్ సర్కార్‌తో అభివృద్ధి జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీ చేయలేని పనులను బీజేపీ చేసి చూపించింది. 33 శాతం మహిళ రిజ్వేషన్లు , అయోధ్యలో రామమందిర నిర్మాణం చేపట్టిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుంది. తెలుగు తేజాలకు పద్మ భూషణ్, పద్మవిభూషణ్ అవార్డు వరించడంలో ఎవరి సిఫారసు లేదు. యాభై రోజుల రేవంత్ రెడ్డి పాలన కేసీఆర్ అడుగుజాడల్లో నడుస్తున్నట్టు అనిపిస్తోంది. తెలంగాణ రాష్ట్ర పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడ్డట్టు అయ్యిందని' లక్ష్మణ్ సీఎం రేవంత్ పాలనను విమర్శించారు.

## కాంగ్రెస్ పాలనతో మహిళల్లో భరోసా

**- నటి దివ్యవాణి వెల్లడి**



హైదరాబాద్,జనవరి26 యాభై రోజుల కాంగ్రెస్ పాలనపై మహిళలకు విశ్వాసం పెరిగిందని సినీ నటి దివ్యవాణి పేర్కొన్నారు. గాంధీభవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ...ఉచిత బస్సు ప్రయాణం వల్ల పదికోట్ల మంది మహిళలు ప్రయోజనం పొందారని అన్నారు. ప్రగతి భవన్‌ను ప్రజా భవన్ మార్చివేశారన్నారు. రాజకీయ విలువలు పెంచేలా కేసీఆర్ అనారోగ్యంతో ఉన్నప్పుడు సీఎం రేవంత్ రెడ్డి వెళ్లి పరామర్శించారని దివ్యవాణి పేర్కొన్నారు. ఏపీసీసీ అధ్యక్షురాలిగా షర్మిల నియామకంపై దివ్యవాణి స్పందించారు. షర్మిల నిమాయకం శుభసూచికమన్నారు. నియంత పాలన అంతం కోసం వచ్చిన మహిళ షర్మిల అని కొనియాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో నూతన ఉత్సాహంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం జరుగుతోందని దివ్యవాణి పేర్కొన్నారు.

# ఆనందాచారికి పద్మ పురస్కారం

**సేవలకు గుర్తింపు దక్కిందన్న ఆనందం**

యాదాద్రి,జనవరి26 యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన స్థపతి, సలహాదారుడిగా విధులు నిర్వహించిన వేలు ఆనందాచారికి పద్మ పురస్కారం దక్కడంతో పలువురు అభినందించారు. ఆయన సేవలకు ఇది గుర్తింపు అన్నారు. చిత్తూరు జిల్లా వెన్నంపల్లి గ్రామంలో 1952, జూన్ 1న జన్మించారు. 1972లో టీటీడీ శిల్ప కళాశాలలో నాలుగేళ్ల శిల్పకళా కోర్సులో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. థియలాజికల్ యూనివర్సిటీ యూకే సికింద్రాబాద్ బ్రాంచి ద్వారా పీహెచ్‌డీ అందుకున్నారు. 1975లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ శిల్పకళాశాలలో అధ్యాపకుడిగా చేరి 1978 వరకు విధులు నిర్వర్తించారు. 1980లో శ్రీశైలం దేవస్థానం ప్రాజెక్ట్‌లో పనిచేశారు. 1987లో ఆయనకు అఖిల భారత చిత్రకళా పోటీల్లో బంగారు పతకం లభించింది. 1990లో ఉపస్థపతిగా పదోన్నతి పొంది, ద్వారకా తిరుమల దేవస్థానంలో విధులు నిర్వహించారు. 2009లో ప్రధాన స్థపతిగా విధుల్లోకి చేరి, 2010లో పదవి విరమణ పొందారు. అనంతరం ఆయన డాక్టర్ సుందర రాజన్ స్థపతితో కలిసి 'మయమత', కాశ్యప శిల్ప గ్రంథాలను తెలుగులో అనువాదం ప్రచురణకు కృషి చేశారు. 2014లో శ్రీశైలం దేవస్థాన ఆస్థాన స్థపతిగా విధులు నిర్వహిస్తూ తెలంగాణ ఆవిర్భావ అనంతరం 2018లో అదనపు స్థపతి సలహారుడిగా నియమితులై 2019లో స్థపతి సలహాదారుగా ఆలయ ఉద్ఘాటన వరకు కొనసాగారు. ప్రస్తుతం ఆయన కర్ణాటక, కేరళ, తెలంగాణ తదితర రాష్ట్రాల్లోని వివిధ దేవాలయాల పునర్నిర్మాణ, జీర్ణోద్ధరణ పనులను పర్యవేక్షిస్తున్నారు. వేలు ఆనందాచారి 101 మెడిసిన్ వర్ణ చిత్రాలను చిత్రీకరించి, 2002 సంవత్సరంలో గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుకు ప్రయత్నం చేశారు. ఈయనకు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు, గ్లోబల్ ఇండియా, వండర్ బుక్ ఆఫ్ రికార్డు, ఎవరెస్ట్ బుక్ ఆఫ్ రికార్డు, మిరాకిల్ బుక్ ఆఫ్ రికార్డు వంటి ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఈయనను హైదరాబాద్ లలిత కళాతోరణం ఆధ్వర్యంలో అనేక అవార్డులు, రివార్డుల ద్వారా సన్మానించారు. అదే విధంగా రాయిగిరిలో బుద్ధుడి విగ్రహం రూపొందించే సమయంలో కీలక బాధ్యతలు నిర్వహించారు. శిల్పకళలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను 2002, 2008లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఉగాది పురస్కారానికి అందుకున్నారు. 2013లో కళారత్న అవార్డు సొంతమైంది.

# వెంకయ్య, చిరులకు అభినందనలు

**ఫోన్ చేసి అభినందించిన కిషన్ రెడ్డి**

హైదరాబాద్,జనవరి26 పద్మవిభూషణ్ అవార్డుకు ఎంపికైన మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, మెగాస్టార్ చిరంజీవిలకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పద్మ అవార్డుకు ఎంపికైన తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. రాజకీయాల్లో.. సినిమాల్లో.. ఇలా రెండు వేర్వేరు రంగాల్లో ఎలాంటి నేపథ్యమూ లేకుండా అతి సామాన్యులుగా ప్రస్థానాన్ని ప్రారంభించి, తమ స్వయంకృషితో, అద్భుత ప్రతిభతో అత్యున్నత స్థానాలకు ఎదిగిన ఇద్దరు అసామాన్యులైన తెలుగు తేజాలను పద్మవిభూషణ్ పురస్కారం వరించింది! వారిలో ఒకరు మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు కాగా.. మరొకరు తెలుగు చిత్రపరిశ్రమలో మెగాస్టార్‌గా వెలుగొందుతున్న చిరంజీవి. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని.. 2024కుగాను పద్మ పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం గురువారం రాత్రి ప్రకటించింది. విద్య, వైద్యం, సాహిత్యం, కళలు, సామాజిక సేవ.. ఇలా వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన 132 మంది ప్రముఖులకు ఈ పురస్కారాలను కేంద్రం పద్మ పురస్కారాలను ప్రకటించింది. మొత్తం 132 మందిలో ఐదుగురిని పద్మవిభూషణ్.. 17 మందినిపద్మభూషణ్, 110 మందిని పద్మశ్రీ పురస్కారాలు వరించాయి. బిహార్‌కు చెందిన శాంతిదేవి పాసవాన్, శివన్ పాసవాన్ ద్వయానికి కళల విభాగంలో ఒకటి.. కేరళకు చెందిన అశ్వతి తిరునల్ గౌరి, లక్ష్మీ బాయి తంపురట్టి ద్వయానికి సాహిత్యం, విద్య కేటగిరీలో ఒకటి చొప్పున పద్మశ్రీ పురస్కారాన్ని కేంద్రం ప్రకటించింది. మొత్తమ్మీద ఈ జాబితాలో 30 మంది మహిళలు ఉన్నారు. ఇటీవలే కన్నుమూసిన తమిళ నటుడు.. కెప్టెన్ విజయ్‌కాంత్ సహా తొమ్మిది మందికి మరణానంతర పురస్కారాలను కేంద్రం ప్రకటించింది.

# ఫూలే విగ్రహం ఏర్పాటు చేయాల్సిందే?

హైదరాబాద్,జనవరి26: బీసీల అభ్యున్నతి కోసం భారత్ జాగృతి పలు కార్యక్రమాలు చేపట్టిందని.. వారి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేసేలా పోరాటం చేస్తామని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. అసెంబ్లీ ఆవరణలో జ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పూలే విగ్రహం అసెంబ్లీలో పెడితే బీసీలకు న్యాయం జరుగుతుందా అని కొంతమంది తనను ప్రశ్నిస్తున్నారన్నారు. బీసీల హక్కుల సాధన కోసం భారత్ జాగృతి తరపున పోరాటం కొనసాగుతుందని చెప్పారు. ఏప్రిల్ 11వ తేదీ వరకు పూలే విగ్రహ ఏర్పాటుపై కార్యాచరణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. శుక్రవారం నాడు తెలంగాణ భవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ... భారత జాగృతి మహిళా బిల్లులో బీసీ కోటా ఉండాలని డిమాండ్ చేస్తుందన్నారు. తెలంగాణ వచ్చాకనే జ్యోతిరావు పూలే, ఐలమ్మ, దొడ్డి కొమరయ్య, జయశంకర్, కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతులను అధికారికంగా నిర్వహిస్తున్నట్లు



గుర్తుచేశారు. మార్కెట్ కమిటీల్లో బిసిలకు రిజర్వేషన్ కల్పించినట్లు తెలిపారు. తెలంగాణ జాగృతి పలు సమస్యలపై నిరంతర పోరాటం చేస్తోందన్నారు. పార్లమెంట్‌లో మహిళా బిల్లు పాస్ చేయాలని ఉద్యమం చేశామని చెప్పారు. దేశం ఎటు వైపు వెళ్తుందో చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. భారత జాగృతి ఆధ్వర్యంలో అనేక సామాజిక కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే అసెంబ్లీ ఆవరణలో అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠాపన కోసం పోరాటం చేసి సాధించామన్నారు. బడుగుల కోసం పనిచేసిన గొప్ప సంఘ సంస్కర్త ఆశాజ్యోతి విగ్రహాన్ని అసెంబ్లీలో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అసెంబ్లీ అవరణలో విగ్రహం ఏర్పాటు చేయాలని శుక్రవారం నాడు స్పీకర్‌కు వినతి పత్రం అందించినట్లు తెలిపారు. తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల మద్దతు కూడగట్టడానికి ఈ లేఖ అందించినట్లు చెప్పారు. మహిళా రిజర్వేషన్ల కోసం ఉద్యమించి సాధించినట్లు తెలిపారు. మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళలకు కోటా కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్నామన్నారు. గత పదేళ్లలో బీసీల కోసం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 50 వేల కోట్లు ఖర్చు చేసిందని గుర్తుచేశారు. ఆ పరంపర కొనసాగింపుగా ఏ ప్రభుత్వం వచ్చినా బీసీల కోసం పనిచేయాలని ఒత్తిడి చేస్తామన్నారు. తొలి అడుగుగా అసెంబ్లీలో జ్యోతిరావు పూలే విగ్రహ సాధన కార్యక్రమాన్ని తీసుకున్నామని కవిత తెలిపారు.

# చిన్ననాటి నుంచే కూరెళ్ల అత్యుత్తమ ప్రతిభ

**పద్మశ్రీతో పలువురి అభినందనలు**

నల్లగొండ,జనవరి26 దాశరథిపురస్కార గ్రహీత, మధుర కవి కూరెళ్ల విఠలాచార్యకు పద్మశ్రీ దక్కడంతో జిల్లా వాసులు, ఆయన సన్నిహితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇది గొప్ప గౌరవమని పలువురు అభినందించారు. ఉమ్మడి నల్లగొండజిల్లాలోని రామన్నపేట మండలం నీర్నేముల గ్రామంలో తన అమ్మమ్మగారి ఇంట్లో 1938, జూలై 9న జన్మించారు. విఠలాచార్య తల్లిదండ్రులు కూరెళ్ల వెంకటరాజయ్య, లక్ష్మమ్మ. వీరి స్వగ్రామం రామన్నపేట మండలంలోని వెల్లంకి. చిన్నతనం నుంచే తెలుగులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచేవారు. 1959లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా రామన్నపేట మండలంలోని మునిపంపులలో ఉద్యోగం సాధించారు. 1960లో భువనగిరి సమితి పరిధిలోని వడాయిగూడెం పాఠశాలకు బదిలీ అయ్యారు. 1961లో 'బాపూ భారతి'అనే చిన్న లిఖిత పత్రికను స్థాపించారు. విద్యార్థి దశలోనే రచనా వ్యాసంగానికి శ్రీకారం చుట్టిన విఠలాచార్య అనంతరం కాలంలో విఠలేశ్వర శతకం, స్మృత్యంజలి, వెల్లకివెలుగు, కూరెళ్లపద్యకుసుమాలు వంటి రచనలు బాగా ప్రాచుర్యం పొందాయి. విఠలాచార్యను అభినవ పోతన, మధురకవి, సుధీతిలకం బిరుదులతో వివిధ సందర్భాల్లో సన్మానించారు. మధురకవిగా ప్రాచుర్యం పొందారు. 1980లో తెలుగు ఉపన్యాసకుడిగా ఉద్యోగోన్నతి పొందారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనేగాక రాష్ట్రంలోని అనేక చోట్ల సాహితీ ప్రసంగాలు చేసేవారు. సాహిత్యంపై ఉన్న మమకారంతో 2014లో తన ఇంట్లోనే గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. వేల పుస్తకాలను సేకరించారు. విఠలాచార్య కృషిని 2021లో దేశ ప్రధాని నరేద్రమోదీ మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రస్తావించడంతో విఠలాచార్య ఖ్యాతి జాతీయస్థాయిలో పలువురి దృష్టిని ఆకర్శించింది.

# ఐదు దశాబ్దాలుగా కళకు పట్టం

యక్షగాన కళకు అందిన పద్మం

జనగామ,జనవరి26 గడ్డం సమ్మయ్య ఐదు దశాబ్దాలుగా చిందు యక్షగాన కళకు దివిటీ పట్టారు. ఆయన కష్టఇకి, కళను సజీవంగా నిలిపినందుకు పద్మపురస్కారం దక్కింది. దీంతో గ్రామంలో ఆయనకు ప్రశంసలు వెల్లువెత్తాయి. అభినందనలు అందించారు. ఆయనది జనగామ జిల్లా దేవరుప్పుల మండలం అప్పిరెడ్డిపల్లి గ్రామం. రామస్వామి, చండిగాంబ దంపతులకు 1958లో జన్మించారు. ఆ తర్వాత రామస్వామి దేవరుప్పుల మండలం అప్పిరెడ్డిపల్లిలో స్థిరపడ్డారు. సమ్మయ్య ఆరో తరగతి దాకా చదివారు. సమ్మయ్య తమ కులవృత్తి అయిన చిందు యక్షగాన ప్రదర్శనల్లో పాల్గొనేవారు. 16ఏళ్ల వయసులో తొలిసారిగా తండ్రితో కలిసి చిన్ని కృష్ణుడి వేషధారణలో కళారంగ ప్రవేశం చేశారు. జాంబవపురాణం, భాగవతం, రామాయణం వంటి కథలను ప్రదర్శనల రూపంలో చెప్పడమే చిందు యక్షగానం. చిన్ననాటి నుంచి ఈ కళపై మక్కువతో 5 దశాబ్దాలుగా 19వేల ప్రదర్శనలు ఇచ్చారు.

సమ్మయ్య లోహితాంకుడు, ప్రహ్లాదుడు, సిరియాలుడు, బాలవద్దిరాజు పాత్రల్లో ఎక్కువగా ప్రదర్శనలు ఇచ్చేవారు. సత్యహరిశ్చంద్ర, కీచక, కంసుడు, శ్రీకృష్ణుడు, అర్జునుడు, దుర్యోధనుడు, రావణబ్రహ్మ పాత్రల్లో అద్భుతంగా ఒదిగిపోతారు. గడ్డం సమ్మయ్యకు వరంగల్ జిల్లా పర్వతగిరికి చెందిన ముత్తిలింగం కుమార్తె శ్రీరంజినితో 1983లో వివాహం జరిగింది. సమ్మయ్యకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. పెద్దకుమారుడు సోమరాజు చిందు కళలోనే ఉన్నారు. సమ్మయ్య 1991లో ఆలిండియా రేడియాలో 80 ప్రదర్శనలు, దూరదర్శన్‌లో 90 ప్రదర్శనలిచ్చారు. సాంస్కృతిక, పర్యాటక శాఖలో సుమారు 4000 ప్రదర్శనలు ఇవ్వడమే కాకుండా ఢిల్లీ, ఒడిసా, మధ్యప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల్లోనూ అనేక ప్రదర్శనలు ఇచ్చారు.




## రవితేజతో సితార ఎంటర్టైన్మెంట్స్.. డైరెక్టర్ ఎవరు..?

మాస్ మహారాజ్ రవితేజ బర్త్ డే సందర్భంగా మరో క్రేజీ కాంబో సినిమా ఒకటి అనౌన్స్ మెంట్ వచ్చింది. రవితేజతో సితార ఎంటర్టైన్మెంట్స్ సినిమా ప్రకటించారు. సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ లో సూర్యదేవర నాగవంశీ ఈ సినిమా నిర్మించనున్నారు. అయితే ఈ సినిమా డైరెక్టర్ ఎవరన్నది మాత్రం ఇంకా నిర్ణయించలేదు. సితార బ్యానర్ లో సినిమా అంటే ఆడియన్స్ లో మంచి అంచనాలు ఉన్నాయి.

హారిక హాసిని బ్యానర్ లో స్టార్ సినిమాలతో భారీ బడ్జెట్ సినిమాలు చేస్తుంటే సితార బ్యానర్ లో మీడియం రేంజ్ సినిమాలు చేస్తున్నారు. నాగ వంశీ సినిమా మొదలైనప్పటి నుంచి రిలీజ్ వరకు సూపర్ బూస్టింగ్ ఇస్తారు. ఈ బ్యానర్ లో చిన్న సినిమాలను కూడా నిర్మిస్తారు నాగ వంశీ. లేటెస్ట్ గా రవితేజతో సినిమా అనౌన్స్ చేశారు. అయితే ఈ సినిమాకు దర్శకుడు ఎవరన్నది సస్పెన్స్ లో పెట్టారు. మరి రవితేజతో సినిమా చేసేందుకు రెడీగా ఉన్న దర్శకుడు ఎవరు. వారిద్దరి కాంబో ఎలాంటి సినిమా రాబోతుంది అన్నది చూడాలి. ప్రస్తుతం రవితేజ నటించిన ఈగల్ రిలీజ్ కు రెడీ అవ్వగా హరీష్ శంకర్ డైరెక్షన్ లో మిస్టర్ బచ్చన్ సినిమా చేస్తున్నాడు రవితేజ.

ఈ సినిమాతో పాటుగా అనుదీప్ కెవితో ఒక సినిమా ఉంటుందని టాక్. త్రివిక్రం కూడా రవితేజతో సినిమా చేయాలని చూస్తున్నట్టు చెప్పుకుంటున్నారు.

## గుంటూరు కారం నుంచి అమ్మ పాట విడుదల




టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో వచ్చిన తాజా చిత్రం 'గుంటూరు కారం' సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. మొదటిరోజే ఈ సినిమాకు కొంచెం మిక్స్డ్ టాక్ రావడంలో కలెక్షన్ల మీద ప్రభావం పడుతుందని ట్రేడ్ వర్గాలు భావించాయి. కానీ ఆ అంచనాలను తలకిందులు చేస్తూ ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద దూసుకుని పోతుంది. అయితే ఈ సినిమాలోని సాంగ్స్ ఎంత పెద్ద హిట్ అయ్యాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇప్పటికే ఈ సినిమా నుంచి ధమ్ మసాలా, కుర్చీ మడత పెట్టి, ఓహ్ మై బేబీ, సాంగ్ లు విడుదల చేయగా.. చార్ట్ బస్టర్‌లుగా నిలిచాయి. ఇదిలావుంటే.. తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ 'అమ్మ' అనే ఎమోషనల్ సాంగ్‌ను విడుదల చేశారు. పసి వాడయై వేచి చూస్తుందా బదులే రాని గతం. పగ వాడయై నింద మోస్తుందా ఎదుటే ఉన్న నిజం అంటూ సాగిన ఈ పాట హృదయాలను హత్తుకునేలా ఉంది.



## మార్చి 29న డేట్ ఫిక్స్ చేసిన టిల్లు స్క్వేర్

సిద్ధు జొన్నలగడ్డ, అనుపమ పరమేశ్వరన్ జంటగా వస్తున్న 'టిల్లు స్క్వేర్' సినిమా కొత్త విడుదల తేదీని ఖరారు చేసింది. ఈ సినిమా ఇప్పటికి రెండు మూడు తేదీలను ప్రకటించి వాయిదా వేస్తూ వచ్చింది. ఇప్పుడు ఎట్టకేలకు ఒక కొత్త తేదీని అంటే మార్చి 29న విడుదలవుతోందని చిత్ర నిర్వాహకులు ప్రకటించారు. మళ్ళీ మార్పులు లేకుండా ఇదే తేదీని ఖరారు చేస్తారని అనుకుంటున్నారు. ఇంతకు ముందు సిద్ధు నటించిన 'డీజే టిల్లు' కి ఈ సినిమా సీక్వెల్ గా వస్తోంది. అయితే మొదటి దానిలో నేహా శెట్టి కథానాయిక కాగా, ఈ 'టిల్లు స్క్వేర్' లో అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా నటిస్తోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి కూడా. ఈ మూవీలో అనుపమ పరమేశ్వరన్ 'కిల్లర్' లుక్స్ ఇప్పటికే బాగా పాపులర్ అయ్యాయి.

మార్చి 29 అనగానే అప్పటికి వేసవి సెలవులు మొదలవుతాయి కాబట్టి ఈ సినిమాకి అది మంచి విడుదల తేదీగా చిత్ర నిర్వాహకులు భావించవచ్చు అని అంటున్నారు. కానీ ఆ సమయంలో పార్లమెంటుకి, ఆంధ్రాలో అసెంబ్లీ కి ఎన్నికలు జరిగే పరిస్థితి ఉంటే మాత్రం అప్పుడు ఈ సినిమా విడుదల తేదీలో మార్పులు ఏమైనా ఉండొచ్చేమో అని కూడా అంటున్నారు. ఈ సినిమాకి మల్లిక్ రామ్ దర్శకుడు, సూర్యదేవర నాగ వంశీ నిర్మాత. ఈ సినిమాకి ప్రముఖ గాయకుడు రామ్ మిరియాల సంగీతాన్ని అందించటమే కాకుండా అతను పాడిన పాటలు 'టిక్కెట్టే కొనకుండా', 'రాధిక' పాటలు బాగా వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఈ సినిమా గురించి గత సంవత్సరం నుండి వార్తల్లో వుంది, విడుదల తేదీలు, ప్రచార చిత్రాలతో, ఎట్టకేలకి ఇప్పుడు ఒక విడుదల తేదీ ఖరారు చేశారు

## అక్కినేని తరవాత చిరంజీవికే ఆ గౌరవం



టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవిని దేశంలో రెండో అత్యున్నత పురస్కారం పద్మ విభూషణ్ వరించింది. ఈ పురస్కారం చిరంజీవి స్వయంకృషికి తగ్గ ప్రతిఫలంగా సినీ ప్రియులు, అభిమానులు కొనియాడుతున్నారు. అయితే ఇన్నేళ్ల తెలుగు సినీ చరిత్రలో పద్మ విభూషణ్ పురస్కారం ఇద్దరకి మాత్రమే దక్కింది. తొలుత 2011లో నట దిగ్గజం అక్కినేని నాగేశ్వరరావుకు దక్కింది. టాలీవుడ్‌లో తన పేరును శాశ్వతంగా లిఖించుకున్న మహోన్నత వ్యక్తి అక్కినేని నాగేశ్వరరావు. ఆయనకు దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు, పద్మ విభూషణ్, పద్మశ్రీ, కలైమామణి, రఘుపతి వెంకయ్య అవార్డు, ఏడు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు, జాతీయ స్థాయిలో మధ్యప్రదేశ్ ప్రభుత్వం నుంచి కాళిదాసు లాంటి ఎన్నో పేరొందిన అవార్డులు అందుకున్నారు. తాజాగా ఆ ఘనత మెగాస్టార్ చిరంజీవికి మాత్రమే దక్కింది. తెలుగు సినీ రంగంలో అక్కినేని నాగేశ్వరరావు తర్వాత ఆ ఘనత దక్కించుకున్న నటుడిగా చిరంజీవి నిలిచారు. దక్షిణాదికి చెందిన కళారంగంలో తమిళనాట ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం(2021), ఇళయరాజా (2018), కె.జె.ఏసుదాసు(2017), రజనీకాంత (2016) వంటి ఉద్దండులకు పద్మ విభూషణ్ వరించింది.




## చరణ్ బర్త్‌డే కానుకగా మార్చి27న
# ఆర్‌సి 16 పోస్టర్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం 'గేమ్ ఛేంజర్' షూటింగ్ తో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. చాలాకాలంగా చిత్రీకరణ జరుపుకుంటూ వస్తున్న ఈ సినిమా నుంచి ఇప్పటివరకు ఎలాంటి అప్డేట్ లేకపోవడంతో ఫ్యాన్స్ నిరాశ చెందుతూ వస్తున్నారు. సినిమా నుంచి ఇప్పటివరకు టైటిల్ అనౌన్స్మెంట్ తప్పితే మరో అప్డేట్ లేదు. ఇప్పుడు ఈ ప్రాజెక్టు కంటే చరణ్ తర్వాత చేయబోయే 'ఆర్‌సి16' ప్రాజెక్ట్ పైనే దృష్టి సారిస్తున్నారు. ఇలాంటి తరుణంలో ఈ ప్రాజెక్టుకు సంబంధించి అదిరిపోయే అప్డేట్ ఇచ్చేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు. ఈ చిత్రానికి సంబంధించి ఫస్ట్ లుక్ రిలీజ్ చేసేందుకు ఓ స్పెషల్ డేట్ ని ఫిక్స్ చేశారట మూవీ టీం. ఆ స్పెషల్ డేట్ మరేదో కాదు.. రామ్ చరణ్ బర్త్ డే రోజు ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేయడానికి మేకర్స్ ఎ÷--లాన్ చేసినట్లు తెలుస్తోంది. మార్చి 27న రామ్ చరణ్ బర్త్ డే కావడంతో ఆ రోజు ఫ్యాన్స్ కి ఫస్ట్ లుక్ పోస్టర్ ని రిలీజ్ చేయబోతున్నారట. ఇక ఈ న్యూస్ తో ఫాన్స్ ఫుల్ ఖుషి అవుతున్నారు. గత ఏడాది రామ్ చరణ్ బర్త్ డే సందర్భంగా 'ఆర్‌సి16' ప్రాజెక్ట్ ని ఓ పోస్టర్ ద్వారా అనౌన్స్ చేశారు. ఇక ఈ ఏడాది అదే చరణ్ బర్త్ డే రోజు ఫస్ట్ లుక్ పోస్టర్ ని విడుదల చేస్తుండటం విశేషం. మార్చి రెండో వారం నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించబోతున్నారు. రూరల్ బ్యాక్ డ్రాప్ లో విలేజ్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కనున్న ఈ సినిమాలో రామ్ చరణ్ మునిపెన్నోడు కనిపించని డిఫరెంట్ రోల్ చేస్తున్నారు

ఈ సినిమాలో రామ్ చరణ్ పాత్రపై బుచ్చిబాబు ప్రత్యేక శ్రద్ధ వహించినట్లు చెబుతున్నారు. రంగస్థలం సినిమాలోని చిట్టిబాబు పాత్రను మించేలా చరణ్ రోల్ ని డిజైన్ చేసినట్లు టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాలో రామ్ చరణ్ సరసన సాయి పల్లవి నటిస్తున్నట్లు ఇప్పటికే వార్తలు వినిపించాయి. అయితే దీనిపై ఇంకా క్లారిటీ రావాల్సి ఉంది. ఇక ఈ సినిమాలో తమిళ విలక్షణ నటుడు విజయ సేతుపతి తో పాటు కన్నడ స్టార్ శివ రాజ్ కుమార్ సైతం ఓ ప్రత్యేక పాత్రలో కనిపించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

## క్యూరియాసిటీ పెంచుతున్న సూర్య కంగువ




కోలీవుడ్ స్టార్ హీరో సూర్య టైటిల్ రోల్‌లో నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా కంగువ. శివ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ సూర్య 42 ప్రాజెక్ట్‌గా వస్తోంది. మేకర్స్ ఇప్పటికే లాంఛ్ చేసిన కంగువ గ్లింప్స్ వీడియో, పోస్టర్లు నెట్టింట క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. మేకర్స్ ఇటీవలే పొంగళ్ శుభాకాంక్షలు తెలియజేస్తూ షేర్ చేసిన కొత్త లుక్‌లో సూర్య చేతికి టాటూస్ కనిపిస్తున్నాయి. సూర్య మరోవైపు సెకండ్ లుక్‌లో ఓ వైపు వారియర్‌గా కత్తి పట్టుకుని కనిపిస్తుండగా.. ఇంకోవైపు స్టైలిష్ లుక్‌లో మ్యాజిక్ చేస్తున్నట్టుగా మెస్మరైజ్ చేస్తున్నాడు. కంగువలో దిశాపటానీ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోండగా.. బాబీడియోల్ కీలక పాత్రలో నటిస్తున్నాడని తెలిసిందే. తాజాగా అదిరిపోయే అప్‌డేట్ అందించారు. కంగువలో కీ రోల్ జటరతిసజీనిను పరిచయం చేయబోతున్నట్టు ప్రకటించారు. ఈ మూవీ 3డీ ఫార్మాట్‌లో సందడి చేయనుంది. సూర్య కెరీర్‌లో బ్లాక్ బస్టర్ ఆల్బమ్స్ అందించిన రాక్ స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ కంగువ చిత్రానికి బ్యాక్ గ్రౌండ్ స్కోర్, మ్యూజిక్ అందిస్తున్నాడు. కంగువ గతానికి, ప్రస్తుతకాలానికి మధ్య ఉండే కనెక్షన్‌తో సాగే స్టోరీలైన్ ఆధారంగా కంగువ తెరకెక్కుతున్నట్టు ఇన్‌సైడ్ టాక్. ఈ ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుండగా.. రిలీజ్ డేట్‌పై మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది. సూర్య మరోవైపు సుధా కొంగర డైరెక్షన్‌లో సూర్య 43లో కూడా నటిస్తున్నాడని తెలిసిందే.

